PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 114 | విజయవాడ, శనివారం 25 నవంబర్ 2023 | 6+ 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 25 November 2023 | Rs

రాజస్థాన్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

5



6

9న డబ్ల్యుపిఎల్ వేలం

- ఫ్రాంచైజీల నగదు పెంపు : బిసిసిఐ

'లెక్క'లేని ఖర్చు

రూ. 73,694 కోట్లపై కాగ్ ఆక్షేపణ

బడ్జెట్ మాన్యువల్‌కు విరుద్ధమని వ్యాఖ్య



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో జరుగుతున్న ఖర్చుల తీరును కంప్ట్రోలర్ అడిటర్ జనరల్ (కాగ్) తీవ్రంగా ఆక్షేపించింది. బడ్జెట్ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యయ నిర్వహణ జరుగుతోందని పేర్కొంది. ఈ మేరకు ప్రధాన ఆడిటర్ జనరల్ కార్యాలయ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందింది.ప్రతిపాదనలు లేకుండానే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని పేర్కొంది. నెలవారీ వ్యయ నివేదికల్లో భాగంగా సెప్టెంబర్ వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈ నివేదికను రూపొందించినట్లు సమాచారం. ఏ శాఖకు ఎంత మొత్తంలో ఖర్చు చేయాలన్నది ముందుగానే బడ్జెట్‌లో స్పష్టంచేసి శాసనసభ ఆమోదాన్ని పొందాలి. అయితే సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీల్లో ఏకంగా 73,694 కోట్ల రూపాయలను ఎటువంటి కేటాయింపులు లేకుండానే ఖర్చు చేసినట్లు కాగ్ గుర్తించింది. మొత్తం 260 అంశాల్లో ఈ మొత్తాన్ని ఖర్చు చేసినట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఇందులో 66,596 కోట్ల రూపాయలను 'ఆర్థిక నిర్వహణ ' అని పేర్కొంటూ ఖర్చు చేశారని తెలిపింది. ఈ నిధులను ఏయే శాఖలకు ఖర్చు చేశారన్న వివరాలు కూడా లేవని సమాచారం. రికార్డుల్లో మాత్రం కేవలం 25 అంశాల్లోనే ఈ వ్యయం చేసినట్లు కాగ్ పేర్కొనడం విశేషం. ఇక పట్టణాభివృద్ధి శాఖలో మరో 3,494 కోట్లను ఇలాగే బడ్జెట్ కేటాయింపులు లేకుండా వ్యయం చేసినట్లు గుర్తించారు. సంక్షేమశాఖల్లో కూడా ఐదొందల కోట్ల వరకు ఖర్చు చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో కూడా 600 కోట్ల వరకు కేటాయింపులు లేకుండానే ఖర్చు చేసినట్లు తేల్చారు. ఇంధన శాఖలో కూడా 563 కోట్ల వరకు లెక్కల్లేకుండా ఖర్చు చేసినట్లు తేలింది. ఇక బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కన్నా అదనంగా 8,732 కోట్లను అనేక శాఖల్లో ఖర్చు చేసినట్లు పిఏజి విమర్శించింది.

కేటాయింపులు అంకెల్లోనే

కాగా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించినప్పటికీ అవి అంకెలకే పరిమితమయ్యాయి. 1914 అంశాలకు సంబంధించి బడ్జెట్‌లో 34,171 కోట్లు కేటాయించగా, అందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని నివేదికలో పేర్కొన్నారు. ఇలా బడ్జెట్‌కు, కేటాయింపులకు, ఆదాయానికి, వ్యయానికి మధ్య భారీ అంతరాలు ఉండడాన్ని నివేదికలో ప్రశ్నించారు.

నియమాలకు విరుద్ధంగా

ఆర్థిక కమిషన్ నియమావళిలో భాగంగా బడ్జెట్‌లో చూపించినదానికన్నా ఎక్కువ వ్యయం చేయకూడదని ఉంది. అలాగే ఒక ఆదేశాల మేరకు మంజూరు చేసిన మొత్తాన్ని మాత్రమే వ్యయం చేయాల్సి ఉంటుంది. ఇటువంటి అనేక నిబంధనలను తాజా కేటాయింపులు, వ్యయంలో అనుసరించలేదని ప్రధాన అక్కౌంటెంట్ కార్యాలయం తన నివేదికలో తేల్చిచెప్పింది.

ఉదారంగా ఆదుకోండి

'కరువు' పై సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కరువులో చిక్కుకున్న రైతులను. వ్యవసాయ కూలీలను ఉదారంగా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ బాలోత్సవ భవనంలో జరిగిన ఈ సమావేశానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి హాజరయ్యారు. కులాంతర వివాహాలకు రక్షణ కల్పించాలని, కల్యాణమస్తును ఐదు లక్షల రూపాయలకు పెంచాలని కూడా ఈ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వీటిలో పాటు పలు తీర్మానాలను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. మీడియాకు విడుదల చేసిన ఆ తీర్మానాల వివరాలు :



సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, చిత్రంలో ఎంఎ బేబి, వై.వెంకటేశ్వరరావు

కరువుపై ఐక్య పోరాటాలు

- 5న మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు
- రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

3

కరువుపై ...

'రాష్ట్రంలో సుమారు 300 పైగా మండలాలలో తీవ్రమైన కరువు ఏర్పడితే రాష్ట్రప్రభుత్వం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. వర్షాభావం వల్ల ప్రస్తుత ఖరీఫ్‌లో 85.97 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా 60.22 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. సాగుభూమిలో 25.75 లక్షల (30 శాతం) ఎకరాల్లో పంటలు వేయలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు రాకపోవడంతో రాయలసీమ, కోస్తా ప్రాంతంలో అత్యధిక జిల్లాల్లో సాగైన పంటలూ చేతికి అందలేదు. తీవ్రమైన కరువు వల్ల ఉపాధి లేక లక్షలాది మంది పేదలు వలస పోయారు. కౌలుదారులు తీవ్రంగా నష్టపోయారు. కరువు పరిస్థితుల పట్ల సకాలంలో స్పందించి పంటల నష్టాన్ని అంచనా వేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఖరీఫ్ కరువు ప్రకటనకు చివరి రోజైన అక్టోబర్ 31న హడావుడిగా 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటన చేసింది. సమగ్ర సమాచారంతో కరువు నెలకొన్న అన్ని మండలాలలను కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి' అని కరువుపై చేసిన తీర్మానంలో సిపిఎం డిమాండ్ చేసింది. 'ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో 17 మండలాల్లో కరువు పరిస్థితులుంటే ఒక్క మండలాన్ని కూడా ప్రకటించలేదు. ప్రకాశం జిల్లాలో 38 మండలాలకు గానూ 30 మండలాలు తీవ్రమైన కరువు పరిస్థితులు ఉన్నాయి, అయినా ఒక్క మండలాన్నీ ప్రకటించలేదు. బాపట్ల జిల్లాలో అద్దంకి, కొరిశపాడు, బల్లికురువ, సంతమావులూరు, పంగులూరు, మార్టూరు వంటి ఆరు మండలాల్లో తీవ్ర వర్షభావ పరిస్థితులున్నాయి. అయినా కరువు మండలాల ప్రకటనలో చేర్చలేదు. అనకాపల్లి జిల్లాలో 24 మండలాలకు 18 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులున్నాయి, ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించలేదు. ఏలూరు జిల్లాలో చింతలపూడి, చాట్రాయి, వేలేరుపాడు, కుక్కనూరు మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు వున్నాయి. మరొక ఏడు మండలాలు పాక్షికంగా కరువు వాతపడ్డాయి. అయినా గుర్తించలేదు. సత్యసాయి జిల్లాలో 31 మండలాల్లో కరువు ఉంటే 21 మండలాలనే ప్రకటించి 11 మండలాలను విస్మరించారు. అనంతపురం జిల్లాలో మూడు మండలాలను విస్మరించారు. నెల్లూరు జిల్లాలో 38 మండలాల్లో 20 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులున్నాయి' అని తీర్మానంలో పేర్కొన్నారు.

పంట నష్టం ఆధారంగా...

'కరువు అంచనాల నిబంధనలను పేర్కొంటూ నవంబర్ 14న జిఓ ఐదును ప్రభుత్వం మిగతా 2లో

ఓటరు జాబితాలో అక్రమాలపై చుండూరు తహశీల్దారు సస్పెన్షన్



ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

ఓటర్ల సవరణ జాబితా తయారీలో అక్రమాలకు పాల్ప డినట్లు నిర్ధారణ కావడంతో బాపట్ల జిల్లా చుండూరు తహశీల్దారు బి.సురేష్ బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శు క్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేష్‌బాబు గతంలో బాపట్ల జిల్లా మార్టూరు తహశీల్దారుగా విధులు నిర్వహించారు. ఆ సమయంలో ఓటర్ల సవరణ జాబితాలో అక్రమాలకు పాల్పడినట్లు పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ దర్యాప్తు నిర్వహించారు. ఓటర్ల జాబితా ఫారం 7 దరఖాస్తుల విషయంలో ఎన్నికల నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలడంతో సురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హైకోర్టు ఆవరణలోనే ఎస్‌ఐ అభ్యర్థుల కొలతలు

2

ప్రజా సమస్యలపై ప్రశ్నించే

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయి
- ఖమ్మం, మధిర రోడ్ షోల్లో త్రిపుర మాజీ సిఎం మాణిక్ సర్కార్




మధిర సభలో మాట్లాడుతున్న మాణిక్ సర్కార్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికలు తెలంగాణకే కాదు దేశానికి అతి ముఖ్యమైనవని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అన్నారు. దేశాన్ని విభజించి పాలించే రీతిలో బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాలని కోరారు. బిజెపి, బిఆర్ఎస్‌ల తొమ్మిదిన్నరేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం బాగా పెరిగాయని తెలిపారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం పట్టణంలోనూ, మధిర అసెంబ్లీ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయాన్ని కాంక్షిస్తూ మధిర పట్టణంలోనూ శుక్రవారం నిర్వహించిన రోడ్ షోల్లోనూ, బహిరంగ సభల్లోనూ మాణిక్ సర్కార్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో వ్యవసాయదారులు, కూలీలు, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేసిన బిజెపిని ఓడించాలనే నినాదంతో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 19 స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారిని గెలిపించి అసెంబ్లీకి పంపితే ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నిస్తారని, ప్రజల తరుపున పోరాడుతారని అన్నారు. 50 ఏళ్లలో కంటే బిజెపి తొమ్మిదిన్నరేళ్ల పాలనలోనే నిరుద్యోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. దేశాన్ని విభజించి పాలించాలనే ఉద్దేశంతో కుల, మత విద్వేషాలను బిజెపి ప్రభుత్వం రెచ్చగొడుతోందని విమర్శించారు. ప్రజా మిగతా 5లో

చంద్రబాబుకు ఇసుక కేసులోనూ ఊరట

ప్రజాశక్తి-అమరావతి



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక విధానం వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టులో శు క్రవారం తాత్కాలిక ఊరట లభించింది. ఆ కేసుల్లో తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవద్దని సిఐడిని హైకోర్టు ఆదేశించింది. రింగ్ రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ కోసం చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై సిఐడి వాదనల నిమిత్తం విచారణ ఈ నెల 29కు వాయిదా వేసింది. అదేవిధంగా ఉచిత ఇసుక విధానం కేసులో సిఐడి కౌంటర్ వాదనల నిమిత్తం విచారణ ఈ నెల 30కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'సుప్రీం' తీర్పును చదవండి

- కేరళ గవర్నర్‌కు సిజెఐ ధర్మాసనం సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిల్లులను ఆమోదించకుండా తొక్కిపడుతూ చట్టసభలను దాటవేసే అధికారం గవర్నర్‌కు లేదని పంజాబ్ గవర్నర్‌కు సంబంధించిన కేసులో గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఒకసారి చదువుకుంటే మంచిదని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌ను అత్యున్నత న్యాయస్థానం సూచించింది. బిల్లులను ఆమోదించడంలో రాష్ట్ర గవర్నర్ ఉద్దేశపూర్వక జాప్యానికి వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారించింది. కేరళ రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాది, మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ.. గవర్నర్ ఆమోదం కోసం పంపిన అనేక బిల్లులు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేరళలో కూడా పంజాబ్ పరిస్థితి నెలకొందన్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని మంత్రులందరూ గవర్నర్‌ను కలిశారని, ముఖ్యమంత్రి చాలాసార్లు కలిశారని అన్నారు. అయినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. ఎనిమిది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వేణుగోపాల్ అన్నారు. కోర్టు జోక్యం చేసుకుని గవర్నర్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కెకె వేణుగోపాల్ డిమాండ్ చేశారు. దీంతో జోక్యం చేసుకున్న సిజెఐ చంద్రచూడ్ పంజాబ్ గవర్నర్ కేసులో ఇచ్చిన తీర్పును చదవమని గవర్నర్‌కు తెలపాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణికి సూచించారు. 'మేము గురువారం రాత్రి పంజాబ్ గవర్నర్ కేసులో ఆర్డర్‌ను అప్‌లోడ్ చేశాం. ఆర్డర్‌ని చూడాలని గవర్నర్ సెక్రటరీకి చెప్పండి. మీ ప్రతిస్పందన ఏమిటో మంగళవారం మాకు తెలపండి' అని సూచించారు. అయితే అటార్నీ జనరల్ వెంకటరమణి మాట్లాడుతూ.. మంగళవారం తాను హాజరుకావడం కష్టమని, కేసును శు క్రవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. అయితే దీన్ని కెకె వేణుగోపాల్ వ్యతిరేకించారు. కేసు తీవ్రత దృష్ట్యా వీలైనంత త్వరగా ఈ పిటిషన్‌ను విచారించాలని కోరారు. దీంతో ప్రధాన న్యాయ మూర్తి డివై చంద్రచూడ్ స్పందిస్తూ.. పిటిషన్‌ను బుధవారం పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, పశ్చిమబెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్, పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ఉంచారని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీవ్రంగా విమర్శించింది.

సిఎం జగన్‌కు, సిబిఐకి సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సిబిఐకి సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. జగన్ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలన్న కేసుతోపాటు బెయిల్ రద్దు పిటిషన్‌నూ విచారించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ రద్దు చేయాలని ఎంపి రఘురామ కృష్ణరాజు సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

సాక్ష్యాలు చెరిపేస్తున్నారనడానికి ఆధారాలు ఏమైనా ఉన్నాయా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు పూర్వాపరాలకు సంబంధించిన వివరాలను రఘురామ తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ కోర్టుకు అందించారు. జగన్‌కు బెయిల్ మంజూరు చేసిన తర్వాత... దర్యాప్తు సంస్థలు ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయలేదన్నారు. ఈ కేసు విచారణను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని తాము దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉందన్నారు. సిబిఐ కేసుల విచారణ తరువాతే ఇడి కేసుల విచారణ చేయాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇడి సవాలు చేసిందన్నారు.ఆ పిటిషన్ కూడా జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం ముందే పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పుడే బెయిల్ రద్దు చేయాలా? అని కోర్టు ప్రశ్నించగా, నోటీసులు ఇచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టాలని రఘురామ తరపు న్యాయవాది కోరారు. జగన్, సిబిఐ సహా ప్రతివాదులందరికీ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను హైదరాబాద్ నుంచి మార్చాలన్న పిటిషన్, ఇడి దాఖలు చేసిన పిటిషన్‌కు బెయిల్ రద్దు పిటిషన్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి మొదటి వారానికి ధర్మాసనం వాయిదా వేసింది.


డెయిరీ ఘటనలో నిందితులకు ముందస్తు బెయిలు

- అరెస్టుకు ప్రయత్నించిన పోలీసులకు ప్రతిఘటన

లోపలి పేజీలో..

ఆగిన దాడులు

- అమలులోకి కాల్పుల విరమణ
- బందీల మార్పిడి షురూ



ఇజ్రాయిలీలతో ఈజిప్టు వెళ్లేందుకు గాజాలోని రఫా సరిహద్దు దాటుతున్న అంతర్జాతీయ రెడ్‌క్రాస్ వాహనాలు. తమ బంధీలో ఉన్న ఇజ్రాయిలీలను హమస్ ఒప్పందంలో భాగంగా విడుదల చేయడంతో వారిని తరలించే బాధ్యతను రెడ్‌క్రాస్ చేపట్టింది.

చదువులపై కరువు కాటు

- పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల హాజరు
- జాడలేని సీజనల్ హాస్టళ్లు



కోసిగి నుంచి వలసపోతున్న చిన్నారులు (ఫైల్)

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా కోసిగి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలోని ఒకటో తరగతిలో 83 మందికిగానూ 27 మంది మాత్రమే హాజరవుతున్నారు. రెండో తరగతిలో 84 మందికిగానూ 36 మంది, మూడో తరగతిలో 103 మందికిగానూ 42 మంది, నాలుగో తరగతిలో 95 మందికిగానూ 35 మంది ఐదవ తరగతిలో 105 మంది విద్యార్థులకుగాను 30 మంది మాత్రమే హాజరవుతున్నారు. ఇది ఆ ఒక్క పాఠశాల పరిస్థితి మాత్రమే కాదు. కరువు కారణంగా జిల్లాలోని అనేక మండలాల్లో ఇదే దుస్థితి. తల్లిదండ్రులు బతకడానికి ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో పిల్లలు కూడా వారితో బాటే వెడుతున్నారు.

అభం, శుభం తెలియని చిన్నారులను కూడా కరువు రక్కసి వదలడం లేదు. తల్లిదండ్రులతో పాటే వారు కూడా బతకడానికి వెళ్లక తప్పని స్థితి నెలకొనడంతో చదువును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. తరుచు ఇటువంటి పరిస్థితి ఏర్పడుతున్నా శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. గత ఏడాది ఇలా వలస వెళ్లే కుటుంబాలలోని పిల్లల కోసం 71 సీజనల్ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఆ దిశలో చర్యలే ప్రారంభించలేదు. దీంతో కరువు కాటుకు గురికాక తప్పనిస్థితి వారికి ఏర్పడింది. జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలోని వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో వలసపోతున్నారు. వ్యవసాయంలో నష్టం రావడం, అప్పులే మిగలడంతో కౌలు రైతులు, పేద రైతులు కూడా పట్టణాలకు వలస బాటపడుతున్నారు. కోసిగి, మిగతా 5లో

పాఠశాల	మొత్తం విద్యార్థులు	హాజరు
ప్రాథమిక బాలికల పాఠశాల, కోసిగి	469	170
ప్రాథమిక పాఠశాల, దొడ్డి	192	100
ప్రాథమిక పాఠశాల, సజ్జలగూడెం	218	161
ప్రాథమిక పాఠశాల, దొడ్డిబెళగల్	114	42
జడ్‌పి ఉన్నత పాఠశాల, కోసిగి	1578	750
జడ్‌పి ఉన్నత పాఠశాల, దుద్ది	480	280

5 'వర్సిటీ'లకు ఇన్‌ఛార్జి విసిలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఐదు యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం వైస్ ఛాన్సలర్లను నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 205ను ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు శుక్రవారం విడుదల చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న రెక్టార్ కె సమతను అదే యూనివర్సిటీకి విసిగా నియమించారు. విక్రమసింహపురి యూనివర్సిటీ విసి జిఎం సుందరవల్లిని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి, యోగి వేమన యూనివర్సిటీ విసిని శ్రీ కృష్ణదేవరాయ విసిగా, ఉర్దూ యూనివర్సిటీ ఫాజల్ రెహమాన్‌ను రాయలసీమ విసిగా, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి డి భారతిని ద్రవిడన్ యూనివర్సిటీకి విసిగా నియమించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

మహిళా పోలీసుల కేసులో తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులకు బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర కీలక విధులను నిర్వహించేందుకు అనుమతించబోమని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఇప్పటికే రాష్ట్రంలలోని ఎస్‌పిలు, డిఐజిలు, పోలీసు కమిషనర్లకు డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మెమో జారీ చేశారన్నారు. కేసుల దర్యాప్తులో మహిళా పోలీసుల పాత్ర ఉండదన్నారు. చిన్నపిల్లలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు దర్యాప్తు చేస్తారని వివరించారు. పోలీసుల పోస్టుల నియామకానికి ఒక శాస్త్రీయ విధానం ఉందని, దానికి విరుద్ధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని పిటిషనర్ల తరపు న్యాయవాదులు యలమంజుల బాలాజీ, నర్రా శ్రీనివాసరావు వాదించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ ముగిసింది.

ఏ తప్పూ చేయలేదు : లోకల్ బాయ్ నాని

- హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ
- 27కి వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో పోలీసులు తనను ప్రధాన నిందితునిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని యూట్యూబర్ లోకల్ బాయ్ నాని అన్నారు. హార్బర్‌లో బోట్లు కాలిపోయిన ఘటనకు సంబంధించి నాని హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని విశాఖ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ సందర్భంగా నాని మీడియాతో మాట్లాడుతూ.. హార్బర్‌లో జరిగిన ప్రమాదంలో తాను ఏ తప్పు చేయలేదని తెలిపారు. సంఘటన జరిగిన రోజున సాయంత్రం 6 నుంచి రాత్రి 11:50 గంటల వరకు తన భార్య శ్రీమంత వేడుకల్లో పాల్గొన్నానని, హార్బర్‌లో ప్రమాదం గురించి తెలియడంతో మంటలు ఆర్పేందుకు అక్కడికి వెళ్లానని చెప్పారు. ఆ సమయంలోనే వీడియో తీసి అప్లోడ్ చేశానని తెలిపారు. తాను ఆ రోజు ఓ హోటల్‌లో ఉన్నానని, లోపలకు ఎప్పుడు వెళ్లిందీ ? బయటకు వచ్చిందీ? అన్నీ సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయన్నారు. వాటిని పోలీసులు పరిశీలించినప్పటికీ తనను ఈ ప్రమాదంలో ప్రధాన నిందితునిగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన అనంతరం తనను విచారణ పేరుతో అదుపులోకి తీసుకొని 20 నుండి 23వ తేదీ వరకూ మానసికంగా, శారీరకంగా వేధించారని, దుర్భషలాడారని తెలిపారు. తనకు సంబంధం లేదని ఎంత చెప్పినా వినలేదన్నారు. తన లాయర్ల ద్వారా హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

- నిశ్చితార్థానికి వెళ్లి వస్తూ నలుగురు
- శ్రీవారి దర్శనానంతరం ఇంటికి వస్తూ మరో ముగ్గురు



తిరుపతిలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల బస్సును ఢీకొన్న కారు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, కావలి రూరల్

తిరుపతి, నెల్లూరులో జిల్లాల్లో శుక్రవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మరణించారు. నిశ్చాతార్థానికి వెళ్లి వస్తుండగా కళాశాల బస్సును కారు ఢీకొన్ని తిరుపతి జిల్లాలో నలుగురు, తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరిగి ఇంటికి వస్తుండగా ఓ మహిళను తప్పించబోయి కంటైనర్‌ను కారు ఢీకొన్ని నెల్లూరు జిల్లాలో ముగ్గురు మరణించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం...తిరుపతి జిల్లా పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం గ్రామం రమేష్ నాయుడు కుటుంబానికి చెందిన ఐదుగురు తమ బంధువు నిశ్చితార్థానికి కారులో పెరంబురు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి జిల్లా నారాయణవనం పోలీసు స్టేషన్ సమీపంలో ముందు వెళు న్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న ప్రయివేట్ డిగ్రీ కళాశాల బస్సును కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రమేష్ నాయుడు (60), ఆయన భార్య పుష్ప (55), బంధువులు భాను (42), వదిన వనజాక్షమ్మ అలియాస్ అమ్ములమ్మ (60) అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన శివమ్మను తిరుపతి రుయాకు తరలించారు.

విజయవాడలోని భవానీపురంలో నివాసముంటున్న బైపాని జీవన్ కుమార్, సునీత దంపతుల కుమారుడికి, హైదరాబాద్‌లోని మహంకాళి లక్ష్మీనరసింహారావు కుమార్తెకు ఇటీవల వివాహమైంది. శ్రీవారి దర్శనార్థం అందరూ కలిసి రెండు కార్లలో హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చారు. శ్రీవారి దర్శనం అనంతరం విజయవాడకు బయలుదేరారు. నెల్లూరు జిల్లా మద్దూరుపాడు జాతీయ రహదారి చెన్నాయపాలెం క్రాస్ రోడ్డు వద్దకు రాగానే కారు అదుపు తప్పి తొలుత ఓ మహిళను ఆ తర్వాత కంటైనర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మద్దూరుపాడు గ్రామానికి చెందిన సుబ్బమ్మ (64), పెళ్లి కుమారుడు తండ్రి జీవన్‌కుమార్ (50), తల్లి సునీత (50) అక్కడికక్కడే మరణించారు. పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తె వారి తల్లిదండ్రులు మరో కారులో వస్తుండడంతో వారికి ఏలాంటి ప్రమాదమూ జరగలేదు.

పునాది దశ నుంచే సరైన విద్య

సమగ్రశిక్ష డైరెక్టరు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులను భవిష్యత్తులో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలంటే వారికి పునాది దశ నుంచే సరైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు అన్నారు. సిబిఎస్ఇ అనుబంధ పాఠశాలల్లోని పాఠ్య ప్రణాళిక తయారీ అంశంపై విజయవాడ లోని ఆంధ్ర లయోలా కళాశాలలో జరుగుతున్న వర్క్ షాప్ శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పిడి హాజరై మాట్లాడారు. సిబిఎస్ఇ పద్ధతిలో పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా పాఠ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కంటెంట్‌తోపాటు యాక్టివిటీస్, హైపర్ లింకులు, వీడియోలను పొందుపరచాలని సూచించారు. ఉపాధ్యాయులు సులభంగా ఉపయోగించుకునేలా పాఠ్య ప్రణాళికలను డిజిటల్ విధానంలో రూపకల్పన చేయాలన్నారు. త్వరలో ఐఐటి, ఐఎస్ఇఆర్ వారితో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. గ్రేడ్ 1, 2 విద్యార్థులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీ టీమ్ హెడ్ ఉషాకుమారి, సిబిఎస్ఇ జాయింట్ డైరెక్టరు ఎంవి కృష్ణారెడ్డి, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పూజ, అనుపమ, నందన్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు కళలు, క్రీడలు బోధించాలి

భవిత కేంద్రాలు, ఉన్నత పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు కళలు, క్రీడలు బోధించాలని డైరెక్టరు శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాలల్లోని బోధన సిబ్బంది ఐఇఆర్‌సి, ప్రత్యేక ఉపాధ్యాయులకు 'అడాప్టివ్ ఆర్ట్ కిట్'ను సమగ్రశిక్ష కార్యాలయంలో 50 మంది కృష్ణా జిల్లా ఉపాధ్యాయులకు అందించారు. ఈ కిట్ ద్వారా సమ్మిళిత విద్యలో భాగంగా బోధన సామర్థ్యాలు మెరుగుపరచడానికి తరగతి గదిని మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడానికి ఉపయోగ పడుతుందని అన్నారు.

ప్రభుత్వ శాఖల తరలింపుపై రాజధాని రైతుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

ప్రభుత్వ శాఖలను విశాఖకు తరలించడంపై నెక్కల్లులో అమరావతి రాజధాని రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. ప్రభుత్వ చర్య కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని మండిపడ్డారు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం తిరిగి ప్రభుత్వ శాఖలను వెనక్కి తీసుకువస్తే ఏం సమాధానం చెబుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వ చర్య వల్ల ప్రజాధనం వధా కాదా.. అని రైతులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దొడ్డిదారిన ప్రభుత్వ శాఖలను తరలించడం చట్ట విరుద్ధమన్నారు. అమరావతి నుంచి పాలన సాగిస్తూనే ఉత్తరాంధ్రను అభివద్ధి చేయవచ్చని తెలిపారు. ఇప్పటికైనా అమరావతిపై విషం చిమ్మడం మానుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు 1438వ రోజుకు చేరాయి. వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, తుళ్లూరు తదితర గ్రామాల్లో దీక్షలు కొనసాగాయి.



నెక్కల్లులో రైతులు, మహిళల ఆందోళన

హైకోర్టు ఆవరణలోనే ఎస్‌ఐ అభ్యర్థుల కొలతలు

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టు ఆవరణలోనే ఎస్ఐ అభ్యర్థుల 'ఎత్తు' కొలిపిస్తామని హైకోర్టు వెల్లడించింది. ఎస్ఐ పోస్టుల ఫలితాల వెల్లడిపై హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలైంది. 2018 నాటి నోటిఫికేషన్‌లో ఎత్తు అంశంపై అర్హత సాధించిన తాము 2023 నోటిఫికేషన్లో అనర్హులుగా ప్రకటించారంటూ 24 మంది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు తమ పర్యవేక్షణలో, హైకోర్టు ప్రాంగణంలోనే ఎత్తు కొలతలు కొలిపిస్తామని హైకోర్టు ప్రకటించింది. పిటిషనర్ల ఎత్తు విషయంలో ఆరోపణలు అవాస్తవమని వెల్లడైతే ఒక్కొక్క పిటిషనరుకు కోర్టు ఖర్చుల కింద రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఇందుకు సిద్ధపడిన పిటిషనర్ల వివరాలను తెలియజేయాలని ఆదేశించింది. ఎత్తు కొలతకు సిద్ధంగా ఉన్న పిటిషనర్లు ముందుకు రావాలని వాళ్ల తరపున న్యాయవాదికి తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జి నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఐ పోస్టుల భర్తీకి 2023 నోటిఫికేషన్లో శారీరక దారుఢ్య పరీక్షల్లో భాగంగా డిజిటల్ మెషిన్‌తో ఎత్తును కొలవడాన్ని తప్పుపడుతూ గతంలో 95 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కారణంగా తాము అనర్హులం అయ్యామన్నారు. మాన్యువల్ విధానంలో కొలతలు తీసుకోవాలని కోరారు. 2018లో జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు నిర్వహించిన కొలతల్లో అర్హత సాధించామని, ఇప్పుడు అనర్హులు ఎలా అవుతామని సందేహాన్ని లేవనెత్తారు. దీంతో హైకోర్టు వినూత్న తరహాలో పై విధంగా హైకోర్టు ప్రాంగణంలోని కోర్టుకు వచ్చిన అభ్యర్థుల ఎత్తును కొలతలు కొలిపిస్తామని తేల్చి చెప్పింది. హైకోర్టు పెట్టిన షరతుకు తాము సిద్ధమేనని పిటిషనర్ల న్యాయవాది చెప్పారు.

ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు

జగన్‌పై టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ తన అనుచరులు, సహ నిందితులకు లక్షల కోట్ల ప్రభుత్వ సొమ్ము దోచిపెడుతున్న విషయం ఒక్కొక్కటీ బయటపడుతోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని రూ.లక్ష కోట్లు వెనకేసుకున్న జగన్ అధికారంలోకి వచ్చాక మరో రూ.2 లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నీతులు వల్లించే జగన్, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వాసుదేవరెడ్డి సహా 41 మందికి కోర్టు నోటీసులివ్వడంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. త్వరలోనే మిగిలిన నిజాలన్నీ బయటకొచ్చి జగన్ తీహార్ జైలుకు పోవడం తథ్యమని అన్నారు. హైకోర్టు తీర్పులను ధిక్కరిస్తూ ప్రభుత్వ కార్యాలయాలను జగన్ తరలిస్తున్నారని మరో ప్రకటనలో విమర్శించారు.

ఒకవైపు అవినీతి కేసులు, మరోపక్క ప్రజల చీత్కారాలతో జగన్ నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారని పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్, మాజీ మంత్రి పరసా రత్నం విమర్శించారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టాలనే లక్ష్యంతో జగన్ పనిచేస్తున్నారని పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు.

చంద్రబాబుపై పెడుతున్న కేసుల్లో ఒక్క ఆధారం కూడా చూపలేకపోయారని పేర్కొన్నారు. చంద్రబాబు సహా ప్రధాన నేతలందరిపై హత్యాయత్నం కేసులు పెట్టడం వెనకున్న అంతర్యం ఏమిటని అధికార ప్రతినిధి పి మాణిక్యరావు ప్రశ్నించారు.

బిసి జనగణనపై రాజకీయం

బిసి జనగణనపైనా జగన్ రాజకీయం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీ పి అనురాధ విమర్శించారు. పదేపదే వాయిదాలు వేయడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లుగా జనగణన బిల్లును గాలికొదిలేసిన జగన్.. ఇప్పుడు తానే చేయిస్తానంటూ ఎన్నికల ముందు హడావుడి చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

రాష్ట్రంలో అరాచక పాలన : పవన్‌కల్యాణ్

- హార్బర్ అగ్నిప్రమాద బాధితులకు జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నాలుగేళ్లుగా రాష్ట్రంలో అరాచకపాలన నడుస్తోందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఏడాదిగా ఫిషింగ్ హార్బర్‌లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని, మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 49 మంది మత్స్యకారులకు జనసేన పార్టీ ప్రకటించిన ఒక్కొక్కరికీ రూ.50 వేల ఆర్థిక సాయాన్ని పవన్‌కల్యాణ్ శుక్రవారం అందజేశారు. మత్స్యకారులకు భరోసా పేరుతో జనసేన ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు జీవనోపాధి కోల్పోవడం బాధాకరమన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా ఎపిలో జెట్టీల నిర్మాణం జరగలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే మెరైన్ పోలీస్ వ్యవస్థను, హార్బర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ద్వారా ప్రతి ఏటా రూ.16 వేల కోట్లు ఆదాయం లభిస్తోందని తెలిపారు. తమకు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని బలంగా ముందుకు వెళ్తామన్నారు. వైసిపిని ఓడించడానికి ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని కూడా తాము వదులుకోవడానికి సిద్ధంగా లేమని తెలిపారు. తొలుత విశాఖ విమానాశ్రయం నుంచి నేరుగా పవన్ ప్రమాద స్థలానికి వెళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు.

అడుగడుగునా అడ్డంకులు : నాదెండ్ల మనోహర్

తమ విశాఖ పర్యటనను అడుగడుగునా అడ్డుకునేందుకు వైసిపి కుట్రలు పన్నిందని జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. మధ్యాహ్నం తాము రావాల్సిన విమానాన్ని రద్దు చేయించారని, రెండు రోజుల క్రితమే రావాల్సి ఉన్న అనుమతులను తుది వరకూ నిరాకరించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంచకర్ల రమేష్ బాబు, కోన తాతారావు, పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, పీతల మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

స్పీకర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

రాజ్యాంగబద్ధ పదవికి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను బర్తరఫ్ చేయాలని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షులు బివి రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో స్పీకర్‌పై శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుపై స్పీకర్ సీతారాం వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, స్థాయి దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

ఉదారంగా ఆదుకోండి

మొదటిపేజీ తరువాయి

విడుదల చేసింది. ఈ జిఓ ప్రకారం రైతులకు కరువు సాయం నామమాత్రంగా అందే అవకాశం ఉంది. వేరుశెనగ ఎకరా సాగుకు రూ. 35 వేలు ఖర్చవుతుండగా ప్రభుత్వం రూ.6,800 కరువు సహాయం చేయనుంది. ఇతర పంటలకు చెల్లించే నష్టపరిహారం పరిస్థితి ఇలాగే ఉంది. పంటల నష్టం ఆధారంగా పరిహారం చెల్లించాలి. పంటల పెట్టుబడి కోసం బ్యాంకులు ఇస్తున్న స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పరిహారం ఇవ్వాలి. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పరిహారం చెల్లించాలి. కరువు మండలాల్లో వలసలను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి. కరువు ప్రాంతాల్లో ఆహార ధాన్యాలు ఉచితంగా అందించాలి. రైతుల బ్యాంకు అప్పులను మాఫీ చేయాలి. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలి. ప్రభుత్వం విస్మరించిన అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి.' అని సిపిఎం డిమాండ్ చేసింది.

కళ్యాణమస్తు.. కులాంతర వివాహాలపై

'కళ్యాణమస్తు, తోఫా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నజరానా కంటితుడుపు చర్య. కులాంతర వివాహం చేసుకున్న దళిత, ఆదివాసీలకు రూ.75 వేల నుండి 1.20 లక్షలు చేసినట్లు ప్రకటించడం యువతను తప్పుదారి పట్టించడమే. వాస్తవానికి ఇరుగు పొరుగు రాష్ట్రాలన్నింటిలోనూ రూ.2.5 లక్షలు ఇస్తున్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలంటే వారిపై సాగుతున్న దాడులను, అణచివేతను అరికట్టాలి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కులదురహంకార (పరువు) హత్యలు జరుగుతున్నాయి. కులం పేరుతో రాక్షసంగా మారి కన్న బిడ్డలనే హతమారుస్తున్నారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వ చర్యలు శూన్యం. దీనికోసం ప్రత్యేక చట్టం చేయాలి. కులాంతర వివాహాలు చేసుకున్న వారికిచ్చే సహాయాన్ని ఐదు లక్షలకు పెంచాలి. అదే విధంగా భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి ఉద్యోగం లేకపోయినా ఉద్యోగం కల్పించాలి. ఇంటిస్థలం ఇచ్చి పక్కా గృహం నిర్మించాలి' అని సిపిఎం డిమాండు చేసింది.

ఐదుగురు సైబర్ నేరగాళ్లు అరెస్టు

- రూ.350 కోట్లు మోసం : ఎస్‌పి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

యూట్యూబ్ వీడియోలను సబ్‌స్క్రైబ్ చేసి, రేటింగు ఇస్తే కమీషన్ ఇస్తామంటూ నమ్మబలికి మోసం చేసే సైబర్ నేరగాళ్లను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఫేక్ అకౌంట్ల ద్వారా వచ్చిన సొమ్మును దుబాయ్‌లో విత్ డ్రా చేసినట్టు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసు కాన్ఫరెన్సు హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్‌పి అన్బురాజన్ వెల్లడించారు. ఆయన వివరాల మేరకు.. ముందుగా కొంత డబ్బులు చెల్లిస్తే యూట్యూబ్ లింకులను పంపుతామని, దీన్ని సబ్‌స్క్రైబ్ చేసి రేటింగు ఇస్తే కమీషన్ ఇస్తామని యువతకు ఆశచూపారు. డబ్బులు పెద్ద మొత్తంలో వారికి చెల్లించే వరకూ కమీషన్ చెల్లించేవారు. ఆ తర్వాత ఐడిని బ్లాక్ చేసేవారు. ఇలా అనంతపురం జిల్లాలో గార్లదిన్నెలో అనిల్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఒకసారి రూ.10 వేలు, మరోమారు రూ.50,500, ఆ తర్వాత రూ.1.49 లక్షలు వేయించుకుని ఐడి బ్లాక్ చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ జరిపితే ఈ డొంక బయటపడిందని ఎస్‌పి తెలిపారు. మోసం చేసి వేయించుకున్న డబ్బులను దుబాయ్‌లో డ్రా చేసినట్టు తేలిందన్నారు. ఇందులో భాగస్వాములైన తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన మహమ్మద్ సమ్మద్, అదే జిల్లా వెంకటగిరికి చెందిన వెంకటాచలం, ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన అజయ్‌రెడ్డి, అనంతపురం నగరానికి చెందిన సంధ్యారాణి, తెలంగాణ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ఎ.సందీప్‌లు అరెస్టు చేసినట్లు చెప్పారు. ప్రధాన సూత్రధారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఈ రకంగా నమోదయిన 1500 కేసులకు సంబంధించి రూ.350 కోట్ల వరకు మోసం జరిగినట్లు ఎస్‌పి వెల్లడించారు.

దొడ్డిదారిన రాష్ట్రప్రభుత్వ కార్యాలయాల తరలింపు చట్టవిరుద్ధం : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దొడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించాలనుకోవడం చట్టవిరుద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాజధానిని అమరావతిలోనే ఉంచాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విశాఖ విధ్వంసం : లోకేష్

విశాఖపట్నానికి దొడ్డిదారిన రాజధానిని తరలించి ఏమి చేస్తారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. అక్కడ పరిశ్రమలు, ప్రాజెక్టులను తరిమేసి ఏమి చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. వేలకోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే పరిశ్రమలూ జగన్ దెబ్బకు వేరే రాష్ట్రానికి వెళ్లాయని, ఇప్పుడు విశాఖ వెళ్లి ఏమి చేస్తారని లోకేష్ ప్రశ్నించారు.

కోర్టులంటే జగన్‌కు లెక్కలేదా? : సిపిఐ

కోర్టులంటే జగన్‌కు లెక్కలేదా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రభుత్వ శాఖలను దొడ్డిదారిన విశాఖకు తరలించాలనుకోవడం సమంజసమా? అని ప్రశ్నించారు. కృష్ణానదితో సంబంధం లేదని కృష్ణా బోర్డును విశాఖకు తరలించడం న్యాయమా? అని ప్రశ్నించారు.


సంగం డెయిరీ వద్ద మోహరించిన పోలీసులు

డెయిరీ ఘటనలో నిందితులకు ముందస్తు బెయిలు

- అరెస్టుకు ప్రయత్నించిన పోలీసులకు ప్రతిఘటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాల ఉత్పత్తిదారులకు బోనస్ చెల్లింపుల్లో ఏర్పడిన వివాదంలో ఈనెల 15న జరిగిన ఘర్షణలో మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో సహా 15 మందిపై నమోదు చేసిన హత్యాయత్నం కేసులో 14 మందికి శుక్రవారం హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందే ఈ కేసులో నిందితులను విచారించేందుకు శుక్రవారం ఉదయం డెయిరీ ప్రధాన కార్యాలయం వద్దకు వెళ్లిన పోలీసులను ఉద్యోగులు, డైరెక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావారణం నెలకొంది. పోలీసులు లోపలికి వచ్చేందుకు ప్రయత్నించగా.. డెయిరీ ప్రధాన కార్యాలయం గేటు మూసివేశారు. కోర్టు నుంచి వారెంటు ఉంటేనే లోపలికి రావాలని కోరారు. దీంతో పోలీసులు వెనుదిరిగారు. తమ విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురు డైరెక్టర్లు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికులందరినీ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో విలీనం చేశారని తెలిపారు. ఆప్కాస్‌లో ఉన్నంత వరకు రెగ్యులర్ కారని, ఆప్కాస్ నుంచి మినహాయించి కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మున్సిపాలిటీలో పని చేస్తున్న రెగ్యులర్ కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. నగరాల విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. గూడూరు నగర పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు వేతనాల చెల్లింపులో అలసత్వం లేకుండా పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కర్నూలులో పని చేస్తున్న 98 మంది క్లాప్ డ్రైవర్లపెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి శ్రీశైలం స్పర్శ దర్శనం నిలుపుదల

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక శని, ఆది, సోమవారాలలో స్పర్శ దర్శనాన్ని నిలుపుదల చేసినట్లు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తెలిపారు. యాత్రికుల రద్దీ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కేవలం అలంకార దర్శనానికి మాత్రమే యాత్రికులకు అవకాశం కల్పించామన్నారు. డిసెంబర్ 12 వరకు కార్తీకమాస ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ అమలు : ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి, తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వాలతో సంపన్నులకే మేలు జరిగిందని, పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోయారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. తెలంగాణలో యువశక్తి, నారీశక్తిని చూస్తే గర్వంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రజల త్యాగాల వల్ల ఏర్పడిందని, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అందరి ఆకాంక్షలు నెరవేరలేదని తెలిపారు. అమరుల ఆకాంక్షలు నెరవేరాయో? లేదో? ప్రజలు ఆలోచించాలన్నారు. యువత సాధించుకున్న తెలంగాణలో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి? ఈ పదేళ్లలో ప్రభుత్వం ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చింది? అని ప్రశ్నించారు. టిఎస్‌పిఎస్‌సి ఉద్యోగ పరీక్షల్లో అవినీతి జరిగిందని, పేపర్లు లీక్ కావడంతో యువత నిరాశకు గురైందని తెలిపారు. ఒక యువతి ఆత్మహత్య చేసుకుంటే ఆమె చావు గురించి ఈ ప్రభుత్వం వ్యంగ్యంగా మాట్లాడిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ అమలు చేస్తామని, పేపర్ లీకేజీలను అరికడతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2,500 వేస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాలకు అన్యాయం చేసిన కెసిఆర్ ప్రభుత్వానికి ఎక్స్‌పైరీ డేట్ దగ్గరపడిందని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కెసిఆర్ దత్తత తీసుకున్న ముల్కనూరులో అభివృద్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. నిరుద్యోగంలో తెలంగాణ నంబర్ 1గా ఉందని విమర్శించారు.

కెసిఆర్, కెటిఆర్‌లను జైలుకు పంపుతాం : అమిత్ షా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంది. పదేళ్లలో ప్రజల కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక్క మంచి పనీ చేయలేదు. కుమారుడు కెటిఆర్ కోసం లక్షల కోట్ల రూపాయలు సంపాదించి పెట్టారు. కెసిఆర్, కెటిఆర్ అక్రమాలు, అవినీతిపై విచారణ జరిపి వారిని జైలుకు పంపిస్తాం' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని బైపాస్ రోడ్డులో శుక్రవారం బిజెపి ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మియాపూర్, చేవెళ్లలో భూములు కబ్జా అయ్యాయని, ఔటర్ రింగ్ రోడ్‌లో స్కాం, కల్వకుంట్ల కవిత మద్యం దందా నిర్వహించి కోట్లు సంపాదించారని ఆరోపించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రత్యేకంగా గల్ఫ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉజ్వల యోజన కింద మహిళలకు నాలుగు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని తెలిపారు. బిజెపి అధికారంలోకి వస్తే పరీక్ష పత్రాలను లీకేజీ చేసిన వారిని జైలుకు పంపుతామన్నారు.

9 నుంచి కులగణన

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కులగణన ప్రక్రియ డిసెంబరు తొమ్మిది నుంచి ప్రారంభమవుతుందని బిసి సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సమగ్ర కులగణన పేదవాడి జీవితానికి భద్రత కల్పిస్తుందని అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనగణన తప్ప కులగణన జరగలేదన్నారు. ప్రజల జీవనస్థితి మారడానికి కులగణన అవసరమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారని అన్నారు. కులగణన చేపట్టేందుకు రాష్ట్రంలోని అన్ని కుల సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని, ఇందుకోసం అధికారుల నేతృత్వంలో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి ఆయా వర్గాల అభిప్రాయాలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బిసిలను చంద్రబాబు కేవలం ఓట్లకు పనికొచ్చే యంత్రాలుగా చూశారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తే నిర్దిష్టత వుండదని టిడిపి మాట్లాడటం తగదని అన్నారు.

కరువుపై ఐక్య పోరాటాలు

- 5న మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు
- రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా కనిపిస్తున్నా.. ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా తీసుకుంటోందని, కరువుపై ప్రభుత్వాన్ని కదిలించేలా ఐక్యపోరాటాలకు సమాయత్తం కావాలని రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ మేరకు డిసెంబరు 5న అన్ని మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రమంతటా తీవ్రమైన కరువు వున్నా.. కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం తగదని అన్నారు. ఇప్పటి వరకూ ఎలాంటి కరువు సహాయక చర్యలను చేపట్టకపోవడం సరైందికాదన్నారు. అలాగే 15 ఏళ్ల క్రితం నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.6 వేలను పంటనష్ట పరిహారంగా ఇస్తామనడం తగదన్నారు. కరువు మాన్యువల్‌ను సవరించి, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కరువు వుందని అంగీకరించక పోవడం ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.



ఎంబివికెలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి

కరువు పరిస్థితులను తట్టుకోలేక కూలీలతోపాటు రైతులు కూడా వలసలు పోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. పొరుగున వున్న కర్ణాటక ప్రభుత్వం కరువుపై ముందుగానే అంచనా వేసి కేంద్రానికి నివేదిక అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ కరువుపై సర్వే చేసి అంచనాలను కూడా రూపొందించకపోవడం సరైందికాదన్నారు. తక్షణం కరువుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాభావంతో దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఉద్యానవన పంటలకు రూ.లక్ష నష్ట పరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కరువు ప్రాంతాల్లో తక్షణం ఉపాధి పనులు చేపట్టాలన్నారు. కూలీలకు 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 చొప్పున వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిసాన్ కాంగ్రెస్ నాయకులు వింత సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కరువు రైతులకు సక్రమంగా బీమా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కౌలు రైతులందరికీ పంట నష్టపరిహారం చెల్లించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం హరిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, సిఐటియు నాయకులు పి అజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు వి నరసింహారావు, నరహరిశెట్టి నరసింహారావు, డి హరనాథ్, ఎం అప్పలస్వామి, కె గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

ప్రజాశక్తి-హిందూపురం



సచివాలయ భవనానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న ఇంటి యజమాని

అద్దె చెల్లించనందుకు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని ఆర్‌టిసి కాలనీ నాల్గవ వార్డు సచివాలయ భవనానికి ఆ ఇంటి యజమాని తాళం వేశారు. నాలుగు నెలలుగా బకాయి ఉన్న అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాళం వేసి, సచివాలయం ముందు నిరసన తెలిపారు. యజమాని నాగరాజు మాట్లాడుతూ.. సచివాలయానికి సంబంధించి అద్దె చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఏ ఒక్కరూ స్పందించలేదన్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో సచివాలయానికి తాళం వేశానన్నారు. అద్దె మొత్తం చెల్లించి, సచివాలయాన్ని వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయానికి తాళం వేశారన్న విషయం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడంతో పురపాలక సంఘం అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ యజమానిని పిలిపించి నాలుగు నెలల అద్దె రూ. 24వేలకు సంబంధించిన చెక్కును అందించారు. అదే విధంగా ఈ సచివాలయంతో పాటు మిగిలిన సచివాలయాలకు ఇవ్వాల్సిన అద్దె బకాయిలను చెల్లించారు.



ఆరుబయలు రంగస్థలం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగార్జున, యార్లగడ్డ తదితరులు

ఎయులో ఆరుబయలు రంగస్థలం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్రా యూనివర్సిటీలో ఆధునికీకరించిన ఆరుబయలు రంగస్థలాన్ని సినీ నటుడు అక్కినేని నాగార్జున శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర సృష్టించిన కళా ప్రాంగణాన్ని ప్రారంభించడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని తెలిపారు. ఈ వేదిక నుంచి భవిష్యత్తులో ఎందరో కళాకారులు పుడతారన్నారు.. తనపై ప్రేమాభిమానాలు పంచుతున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎయు హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ మహోన్నత సంస్కారం కలిగిన వ్యక్తిగా నాగార్జున తండ్రి అక్కినేని నాగేశ్వరరావు నిలుస్తారన్నారు. ఆయన అప్పట్లో గుడివాడ కళాశాలకు రూ.లక్ష విరాళం ఇవ్వడం, ఎయుకు రూ.25 వేలు అందివ్వడం ఎంతో గొప్ప విషయమని కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు తెలిపారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సిఎం సూచన మేరకు విద్యార్థులకు ఓపెన్ ఎలక్టివ్స్ మ్యూజిక్, గానం, నృత్యం, చిత్రలేఖనం, నటన కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. రెండున్నర దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ఆరుబయలు రంగ స్థలాన్ని దాతల సహకారంతో, ప్రభుత్వం అందజేసిన నాడు-నేడు నిధులతో పూర్తిస్థాయిలో ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో హీరో అక్కినేని అఖిల్, నాగార్జున సోదరి సుశీల, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎయు-సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్ కోర్సుల పోస్టర్‌ను నాగార్జున ఆవిష్కరించారు.

అడ్డుగా ఉన్న కారు తీయమన్నందుకు ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)

రహదారికి అడ్డుగా ఉన్న కారును పక్కకు తీయమన్నందుకు ఆర్‌టిసి డ్రైవర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అల్లెయ్య వివరాల మేరకు.. తిరుపతి డిపోకు చెందిన బస్సు తిరుపతి నుంచి పళ్లిపట్టు(తమిళనాడు రాష్ట్రం)కు 50 మంది ప్రయాణికులతో వెళ్తోంది. మార్గమధ్యంలో వెదురుకుప్ప మండలం పచ్చికాపల్లం సచివాలయం సమీపంలో పెట్రోల్ బంక్ దగ్గర ఒక వ్యక్తి కారును రోడ్డుపై ఆపారు.

బస్సు డ్రైవర్ ఈశ్వరయ్య హారన్ కొట్టి కారు పక్కన పెట్టమన్నారు. దీంతో కారు యజమాని తన అనుచరులతో కలిసి ఈశ్వరయ్యపై పిడిగుద్దులతో దాడి చేశారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఈశ్వరయ్యతో పాటు ఆర్‌టిసి సిబ్బంది ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో ఒకరిని గుర్తించామని, మిగతా వారిని గుర్తించాల్సి ఉందని ఇన్‌ఛార్జి ఎస్‌ఐ దస్తగిరి తెలిపారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకూ పోరాటం : సిఐటియు

- సమస్యలపై సిహెచ్‌డబ్ల్యుల దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

తమను ఆశా వర్కర్లుగా మార్చాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సిహెచ్‌డబ్ల్యులు) శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట రిలే దీక్షలకు దిగారు. అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్‌కు చెందిన 11 మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న వారంతా ఈ దీక్షలకు కదిలివచ్చారు. దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం దిగివచ్చే వరకూ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. రిలే దీక్షలకు స్పందించకుంటే డిసెంబర్ 6 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడతారని వెల్లడించారు. గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్న సిహెచ్‌డబ్ల్యుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఆశా వర్కర్లతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ రూ.4 వేలు మాత్రమే వేతనం ఇస్తుండడం శోచనీయమన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు ప్రభుత్వాధికారులకు విన్నవించినప్పటికీ స్పందన కరువైందన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో సిహెచ్‌డబ్ల్యులకు ఇస్తున్న వేతనం ఏమూలకూ సరిపోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ఆశా వర్కర్లతో సమానంగా వేతనాలు, యూనిఫారం, సెల్‌ఫోన్, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వై.మంగమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం నాయకులు కిల్లో పార్వతమ్మ, టి.మోదకొండమ్మ, జె.సావిత్రి, వి.కొండమ్మ, కె.చిన్ని, బి.లక్ష్మి పాల్గొన్నారు.



సిహెచ్‌డబ్ల్యుల దీక్షలను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

రేపు తిరుమలకు మోడీ


- స్వాగతం పలకనున్న సిఎం, గవర్నర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలంగాణా ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఈ నెల 26, 27న తిరుమల శ్రీవారిని ప్రధాని మోడీ దర్శించుకోనున్నారు. 26 రాత్రి తిరుమలలోనే బస చేయనున్నారు. ప్రధాని మోడీకి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ స్వాగతం పలకనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్రస్థాయి అత్యున్నత సమన్వయ సమావేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, జెసి బాలాజీ, టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయం దగ్గర ప్రధాని దిగినప్పటి నుంచి తిరుగు ప్రయాణం వరకూ అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేస్తున్నామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి వివరించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల కోసం అధికారులకు విధులు కేటాయించామని, అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టిటిడి ఇఒ మాట్లాడుతూ.. ప్రధాని తిరుమల చేరుకున్నప్పటి నుంచి వారికి వారి సిబ్బందికి, సిఎం, గవర్నర్‌లకు వసతి, ఆహారం, దర్శనం అన్నీ ప్రణాళికా బద్ధంగా చేపడతామని అన్నారు. తగినంత బందోబస్తుకు సిద్ధంగా ఉన్నామని ఎస్‌పి తెలిపారు.

ఎసిబికి చిక్కిన ఆర్థికశాఖ సెక్షన్ అధికారి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో




ఒంటెద్దు నాగభూషణ రెడ్డి

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్థికశాఖలోని వెల్ఫేర్ విభాగం సెక్షన్ అధికారి ఒంటెద్దు నాగభూషణ్‌రెడ్డి.. ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. విదేశీ విద్యోన్నతి పథకానికి కర్నూలుకు చెందిన మహ్మద్ నదీమ్ హుస్సేన్ కుమారుడు అజ్మతుల్లా షరీఫ్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఫైల్‌ను క్లియర్ చేసేందుకు నాగభూషణ్‌రెడ్డి రూ.40 వేలను డిమాండ్ చేశారని ఎసిబికి నదీమ్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సచివాలయం బస్‌షెల్టర్ వద్ద రూ.40 వేలను నాగభూషణ్‌రెడ్డి శుక్రవారం తీసుకుంటుండగా ఎసిబి పట్టుకుంది.

అదాని కేసులో తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ : తీవ్ర అకౌటింగ్ మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అదాని కేసులో సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. అదాని గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని.. హిండెన్ బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌తో ఆ కంపెనీల సూచీలు భారీ పతనాన్ని చవి చూడటంతో ఇన్వెస్టర్లు లక్షల కోట్ల రూపాయలు నష్టపోయిన విషయం తెలిసిందే. అదానిపై వచ్చిన ఆరోపణలపై అత్యున్నత న్యాయస్థానం సెబీని విచారణకు ఆదేశించింది. కాగా దీనిపై శుక్రవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించడంతో పాటుగా తీర్పును రిజర్వ్ చేసింది. ఈ కేసు విషయంలో సెబీ ప్రవర్తన విశ్వసనీయంగా లేదని పిటిషనర్ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. సెబి విచారణ నమ్మదగినది కాదని.. 13 నుండి 14 సంస్థలతో అదానీకి సంబంధాలు ఉన్నాయన్నారు. ఫారిన్ పోర్టుపోలియో ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిఐ) మార్గదర్శకాలను విచారణ కమిటీ పరిశీలించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.



కాగా.. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంలో విచారణను పూర్తి చేసేందుకు ఇకపై పొడిగింపును కోరబోమని సుప్రీంకోర్టుకు సెబీ తెలిపింది. పెట్టుబడిదారుల విలువపై మార్కెట్ రెగ్యులేటర్ ఏమి చేస్తోందంటూ ధర్మాసనం ప్రశ్నించింది. వారి సొమ్ము రక్షణకు భరోసా ఇస్తున్నారా అంటూ సెబీని అడిగింది. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర అస్థిరత ఉందని.. ఇన్వెస్టర్ల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించింది. ఈ షార్ట్ సెల్లింగ్ సందర్భాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ధర్మాసనం సూచించింది.

రెగ్యులేటరీ మెకానిజమ్‌ను బలోపేతం చేసేందుకు నిపుణుల కమిటీ సిఫార్సులు పరిశీలనలో ఉన్నాయని, వాటికి సెబీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ఆ రెగ్యులేటరీ సంస్థ తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. అదాని గ్రూపునపై 24 ఆరోపణలు రాగా.. వాటిలో 22 కేసుల దర్యాప్తును ముగించామన్నారు. మిగిలిన రెండింటి విషయంలో విదేశీ నియంత్రణ సంస్థల నుండి ప్రతిస్పందన కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఈ కేసులో దాదాపు విచారణ పూర్తి అయ్యిందని సెబీ కోర్టుకు తెలిపింది. భవిష్యత్తులో మొత్తం 24 కేసుల్లో విచారణను పూర్తి చేసి, నిపుణుల కమిటీ సిఫార్సులతో చట్ట ప్రకారం కొనసాగాలని సెబీకి కోర్టు సూచించింది. హిండెన్‌బర్గ్ నివేదికలోని ఆరోపణలను నిజమని తాము అంగీకరించాల్సిన అవసరం లేదని సిజెఐ అన్నారు. వార్తా పత్రికలో ప్రచురితమైన దానిని సత్యంగా పరిగణించాలని.. చట్టబద్ధమైన సంస్థను అడగలేమని పేర్కొన్నారు. సెబీని అనుమానించడానికి తమ ముందు ఎలాంటి ఆధారాలు లేవన్నారు.

4.5 లక్షల టికెట్లు ఐదు గంటల్లో విక్రయం

- శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

ప్రజాశక్తి -తిరుమల

2024 ఫిబ్రవరి మాసానికి సంబంధించి శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను శుక్రవారం ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలోని గదుల కోటాకు సంబంధించి మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేసింది. దాదాపు 4.5లక్షల టికెట్లను ఐదు గంటల వ్యవధిలోనే యాత్రికులు కొనుగోలు చేశారు. ఈ టికెట్ల విక్రయం ద్వారా టిటిడికి రూ. కోటీ 30 లక్షలు ఆదాయం సమకూరింది. ఫిబ్రవరి 16న రథసప్తమికి సంబంధించిన శ్రీవారి సేవ స్లాట్లను నవంబరు 27న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది.

నేవీ మాజీ అధికారులకు శిక్షపై సమీక్ష

- భారత్ అప్పీల్‌ను స్వీకరించిన ఖతార్ కోర్టు

దోహా: గూఢచర్యం ఆరోపణలపై భారత్‌కు చెందిన ఎనిమిది మంది నౌకాదళ మాజీ అధికారులకు ఖతార్‌లోని ఒక కోర్టు ఇటీవల మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాలు చేస్తూ భారత ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను విచారించేందుకు తాజాగా ఖతార్ కోర్టు అంగీకరించింది. అప్పీల్‌ను పరిశీలిస్తున్నామని, త్వరలో దీనిపై విచారణ ఉంటుందని న్యాయస్థానం తెలిపింది.గూఢచర్యానికి పాల్పడుతున్నారన్న అభియోగాలపై ప్రైవేటు భద్రతా సంస్థ అల్ దహ్రాలో పనిచేస్తున్న ఎనిమిది మంది భారత నౌకాదళ మాజీ అధికారులను గతేడాది ఆగస్టులో అక్కడి నిఘా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఎనిమిది మందికి అక్కడి న్యాయస్థానం అక్టోబర్ చివరి వారంలో మరణశిక్ష విధించింది. దీనిపై అప్పట్లోనే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన భారత్, అత్యంత ప్రాముఖ్యత గల ఈ కేసుపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించింది. దానిలో భాగంగానే కొద్దిరోజుల క్రితం ఖతార్‌లో అప్పీల్ దాఖలు చేసింది. వారి విడుదలకు అవసరమైన చట్టపరమైన మార్గాలపై మన విదేశాంగశాఖ దష్టి సారించినట్లు చెప్పింది.

ఐఇడి పేలుడుతో ఇద్దరు కార్మికుల మృతి

రాయ్‌పూర్ : ఒక మైనింగ్ స్థలంలో అమర్చిన ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి) పేలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో జరిగింది. ఈ పేలిన ఐఇడిని నక్సలైట్లు అమర్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. జిల్లాలోని ఆమడై ఘాటిలోని ఒక ఇనుప ఖనిజం గనిని జయస్వాల్ నెకో ఇండస్ట్రీస్ లిమిటెడ్(జెఎన్‌ఐఎల్)కు కేటాయించారు. దీనిని నక్సలైట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఐఇడిని అమర్చివుంటారని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

చైనాలో శ్వాసకోశ వ్యాధి వ్యాప్తితో భారత్‌కు ముప్పలేదు : కేంద్రం

న్యూఢిల్లీ : చైనాలో కొత్తగా వ్యాప్తి చెందుతున్న శ్వాసకోశ వ్యాధితో భారత్‌కు తక్షణమే ఎలాంటి ముప్పు లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల కాలంలో చైనాలో పాఠశాలలకు వెళ్తోన్న చిన్నారులు అంతుచిక్కని నిమోనియా లక్షణాల బారిన పడుతున్నారంటూ మీడియాలో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. వీటిపై శుక్రవారం కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించింది. ఈ శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన నివేదికలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. చైనాలో వెలుగు చూస్తున్న శ్వాసకోస వ్యాధులు, ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజాల నుంచి భారత్‌కు ముప్పు తక్కువే ఉందని తెలిపింది. 'పిల్లల్లో శ్వాసకోశ అనారోగ్యానికి సంబంధించి సాధారణమైన కారణాలే కనిపించాయి. అంతుచిక్కని వ్యాధికారకాలు, అసాధారణ లక్షణాలు వెలుగులోకి రాలేదు. అయితే, ఎలాంటి అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని కేంద్ర ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, చైనా ఈ నిమోనియా కేసులపై బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అలాగే ఆ దేశానికి వెళ్లే ప్రయాణికుల విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఒ) కూడా ఎలాంటి ప్రత్యేక హెచ్చరికలు జారీ చేయలేదు.



సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం సందర్భంగా గుంటూరు రూరల్ మండలం, లాల్‌పురంలోని ఎఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, పిఎం ఆవాస్ యోజన వంటి 17 పథకాలు అమలు చేస్తోందన్నారు. సంకల్ప యాత్రలో భాగంగా ప్రతి గ్రామంలో ఆయా పథకాల గురించి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం కలిసి ప్రజల్లో అవగాహన కలించాలని కోరారు. కేంద్ర పథకాలపై అవగాహనతోపాటు, దరఖాస్తుల స్వీకరణ, లబ్దిదారుల అభిప్రాయాలను తెలుసుకోవటమే సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజైయ్‌జైన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని, పట్టణ ప్రాంతాల్లో సంకల్ప యాత్ర జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్దిదారుల వివరాలు వెల్లడించారు. తొలుత సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను గవర్నర్ సందర్శించారు. సంకల్ యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జడ్‌పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ఆప్షన్‌ను వాయిదా వేయాలి : ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు జిపిఎఫ్, సిపిఎస్, ఇపిఎఫ్ పెన్షన్లకు ఆప్షన్లు ఇచ్చే అంశాన్ని వాయిదా వేయాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయు) కోరింది. ఈ మేరకు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. జిపిఎఫ్‌లో పదేళ్ల సర్వీసు వున్న ఉద్యోగులు ఆప్షన్ ఇస్తే రూ.10 వేలు పెన్షన్ వచ్చే అవకాశం వుంద న్నారు. చాలా మంది ఉద్యోగులకు పదేళ్ల సర్వీసు లేదని, అలాంటి వారికి ఇప్పుడే ఆప్షన్లు ఇవ్వాలని కోరడం సరైంది కాదని వివరించారు. పెన్షన్ ఆప్షన్లను ఎంచుకునేందుకు కాలపరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపిలోకి జనసేన రాజానగరం మాజీ ఇన్‌ఛార్జి ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ జనసేన మాజీ ఇన్‌ఛార్జి మేడా గురుదత్త ప్రసాద్.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో గురుదత్త ప్రసాద్‌తోపాటు రాజానగరం జనసేన నాయకులు మండపాక శ్రీను, అడబాల సత్యనారాయణ, వడ్డి చిన్నా, నాగవరపు భానుశంకర్, వల్లేపల్లి రాజేష్, చొంగా మణికంఠ తదితరులకు సిఎం జగన్ వైసిపి కండువాలు కప్పి శుక్రవారం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డుల రికార్డ్ వాడకం

ముంబయి : క్రెడిట్ కార్డులను ఇబ్బడిమబ్బడిగా వాడేస్తున్నారు. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో ఏకంగా రూ.1.78 లక్షల కోట్ల వ్యయాలు చేశారు. ఒక్క నెలలోనే ఈ స్థాయిలో వినియోగించడం ఇదే రికార్డ్. ఇంతక్రితం సెప్టెంబర్‌లో రూ.1.42 లక్షల కోట్ల వ్యయాలు నమోదయ్యాయి. పండగ సీజన్ కావడంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భారీగా కొనుగోళ్లు జరగడంతో ఈ వృద్ధి చోటు చేసుకుంది. గడిచిన అక్టోబర్‌లో పాయింట్ ఆఫ్ సేల్స్ (పిఒఎస్) లావాదేవీలు రూ.57,774కోట్లకు, ఇ-కామర్స్ చెల్లింపులు రూ.1,20,794 కోట్లకు పెరిగాయి.

సంపాదకీయం


ఏది చరిత్ర?

నూతన విద్యా విధానం(ఎన్ఇపి)-2020లో భాగంగా పాఠశాల పాఠ్య ప్రణాళికను సవరించేందుకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సిఇఆర్టి) చేస్తున్న కసరత్తు వరుస వివాదాలను మూటగట్టుకుంటోంది. పాఠ్యపుస్తకాల్లో ఎక్కడెక్కడ అయితే 'ఇండియా' అని ఉందో ఆ స్థానంలో 'భారత్' అని మార్చాలంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనసెరిగి చేసిన ప్రతిపాదనపై విమర్శల జడి తడారకముందే మరో విడ్డూరమైన ప్రతిపాదనలను ఎన్సిఇఆర్టి తెరపైకి తీసుకొచ్చింది. రామాయణం, మహాభారతం ఇతిహాసాలను పాఠశాల స్థాయి చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలంటూ ఎన్సిఇఆర్టి ప్రతిపాదించింది. చరిత్రలో కాల్పనిక గాథలు జొప్పించడమేంటని ఇప్పుడు మేధోవర్గం విస్తుపోతోంది. చరిత్ర అంటే కాలగర్భంలో నిబిడీకృతమైన వాస్తవాల సమాహార మాలిక. గతించిన వాస్తవాలను చెరిపివేయడం ఎవ్వరి తరమూ కాదు. మనుషుల్నీ, వస్తువుల్నీ, సంస్కృతినీ సృష్టించేది మనిషే. కావున ఏపాటి యత్నానికైనా మనిషే ప్రమాణం కావాలని కార్ల్‌మార్క్స్ చెబుతారు. 'దేశమంటే మట్టికాదోయ్..దేశమంటే మనుషులోయ్' అని గురజాడ వెంకట అప్పారావు నినదిస్తే...'మానవుడే నా సందేశం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. చరిత్ర అంటే మనుషుల చరిత్ర. మనిషి ప్రమేయమున్న వాస్తవ అంశాల మాలిక. అంతేకాని కాల్పనిక కథలు, ఇతిహాసాలు చరిత్ర ఏనాటికీ కాబోవు. ఎందుకంటే అవి ఊహాజనితం. మహారచయితలు, వాగ్గేయకారులు, సాహితీవేత్తల ఆలోచనల్లో మాత్రమే పురుడు పోసుకున్న కల్పిత పాత్రల సమాహారం. ఆయా కాలాల్లో నాటి మనిషి ఆలోచనల్లో ఉదయించిన రచనలు నాటి సామాజిక పరిస్థితులను పోలి ఉండవచ్చు. కానీ అవి వాస్తవాలు కాబోవు. చారిత్రిక ఘటనలుగా మారిపోవు. ఎన్సిఇఆర్టి అత్యున్నత కమిటీ ఈ తేడానే చెరిపేయాలని చూస్తోంది.

రాజ్యాంగ సంస్థలను, చరిత్ర, పరిశోధన సంస్థలను ఇప్పటికే సంఘ్ పరివార్ అడ్డాలుగా మార్చేసిన మోడీ సర్కార్ ఎన్సిఇఆర్టి ద్వారా మొత్తం దేశ విద్యావ్యవస్థనే కాషాయీకరించే బృహత్ కుట్ర పన్నిందనడానికి ఈ ప్రతిపాదనలే నిదర్శనం. కోవిడ్ సమయంలో విద్యార్థులపై అధ్యయన భారం తగ్గించే పేరుతో ప్రజాతంత్ర, లౌకికవాద భావాలను పెంపొందించే పాఠ్యాంశాలను, పిల్లల్లో దేశభక్తిని పెంపొందించే భగత్‌సింగ్ లాంటి విప్లవ కిశోరాల అధ్యాయాలను తొలగించివేసింది. ఇప్పుడు మరింత బరితెగింపుతో హిందూత్వ ఎజెండాను నూరిపోసేందుకు సిద్ధమైంది. అందుకనే సామాజిక శాస్త్రాలకు సంబంధించిన పాఠ్యాంశాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సి.ఐ ఐజాక్ (71) నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో ఎన్సిఇఆర్టి గతేడాది ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. భారతీయ విచార కేంద్రం ఉపాధ్యక్షులుగా గతంలో పనిచేసిన ఐజాక్‌కు సంఘ్ పరివార్‌తో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన నేతృత్వంలోని కమిటీయే పాఠ్యాంశాలను కాషాయీకరించి చిన్నారుల లేలేత మనసుల్లో మతతత్వ క్రిములను పెంచే కార్యాన్ని భుజానకెత్తుకుంది.

ఎన్సిఇఆర్టి ప్రతిపాదిస్తున్న పాఠ్యాంశాలు 7వ తరగతి నుంచి 12వ తరగతికి సంబంధించినవి. విద్యార్థులకు ఇది కౌమార దశ. పసితనం పోయి భావాలు వికసించే కీలకమైన దశ. ఈ దశలో హిందూత్వాన్ని నూరిపోస్తే భారతదేశంలో మతరాజ్య స్థాపనకు అడ్డు వుండదనే కుట్రలో భాగంగానే వినాశకర విధానాలకు తెరలేపినట్లు కనిపిస్తోంది. పురాణ సాహిత్యంలో రామాయణం, మహాభారతాలు ప్రాముఖ్యతను ఎవ్వరూ కాదనరు. మన దేశంలోనే దాదాపు 300 రకాల రామాయణాలున్నట్లు అంచనా. చరిత్రగా అధ్యయనం చేయాలంటే ప్రామాణికత ఉండాలి. 300 రామాయణాల్లో ఏ రామయణం బోధిస్తారు? అందువల్ల ఎన్సిఇఆర్టి ప్రతిపాదనలు హాస్యాస్పదం. హిందూత్వ ఎజెండాతో బలవంతంగా రుద్దుతున్న ఎన్ఇపి ని ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలి. వినాశకరమైన ఈ విధానాలపై పోరాడేందుకు ఇటీవల 16 విద్యార్థి సంఘాలు ఐక్య కూటమిగా ఏర్పాటయ్యాయి. భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యా వ్యవస్థ కాషాయీకరణ కాకూడదంటే ప్రజలంతా ఎన్ఇపి వ్యతిరేక పోరాటాల్లో భాగమై కేంద్ర కుయుక్తులను అడ్డుకోవాలి.

మహనీయుల మాట



ఒక రాజకీయవేత్త తరువాతి ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. రాజనీతిజ్ఞుడు తరువాతి తరం గురించి ఆలోచన చేస్తాడు.

- జేమ్స్ ఫ్రీమేన్ క్లార్కే,
అమెరికన్ రచయిత.

సందర్భం

రాజ్యం - రాజ్యాంగం



ఆర్. రఘు

స్వతంత్ర భారత చరిత్రలో నవంబర్ 26 అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు. మరీ ముఖ్యంగా ఆధునిక, లౌకిక, ప్రజాస్వామ్య, భారతదేశ నిర్మాణంలో ఈ రోజుకు చాలా ప్రాధాన్యత ఉంది. కారణం 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు. మన దేశానికి స్వతంత్రం వచ్చింది 1947 ఆగస్టు 15. ఆ రోజుతో తెల్లవాడి పాలన, అంటే సామ్రాజ్యవాదుల పాలన అంతమై అధికారం బడా పెట్టుబడిదారీ పాలక వర్గాల చేతుల్లోకి బదలాయించబడింది. ఈ నూతన పాలక వర్గాల రాజ్యం భారత రాజ్యాంగ సభను రూపొందించింది. ఆ రాజ్యాంగ సభే నూతన భారత రాజ్యాంగాన్ని రూపొందించింది. భారత రాజ్యాంగం ఏర్పడిన తర్వాత చర్చ యావత్తూ సహజంగానే రాజ్యాంగం చుట్టే తిరుగుతుంది. రాజ్యాన్ని నిర్వహిస్తున్న బడా పెట్టుబడిదారులు, వారి మిత్ర వర్గాల గురించి చర్చ జరగటం తగ్గిపోయింది. గడచిన ఈ ఏడు దశాబ్దాల కాలంలో భారత రాజ్యాంగం అనేకసార్లు సవరించబడింది. అనేకసార్లు పాలకవర్గాలు తమ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగసభలో ముసాయిదాని ప్రవేశపెడుతూ "రాజ్యాంగం ఎంత ఉన్నతమైనదైనా దాన్ని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే అది ఒక చెడ్డ రాజ్యాంగంగానే నిరూపించబడుతుంది" అని చేసిన హెచ్చరిక ఆధారంగా భారత రాజ్యాంగం అమలు చరిత్రని విశ్లేషించాల్సి ఉంటుంది.

ప్రత్యేకించి భారత రాజ్యాంగం, రాజ్యాంగ సభ ముందుకు వచ్చిన సమయంలోనే...ఈ రాజ్యాంగాన్ని తాము అంగీకరించమని, ఇది హిందువులకు ఆమోదయోగ్యం కాదని, ఇది ఒక అతుకుల బొంత అని, తరతరాలుగా భారత సమాజాన్ని నడిపించిన అసలు సిసలు రాజ్యాంగమైన 'మనుస్మృతి'ని ఈ రాజ్యాంగ నిర్మాతలు విస్మరించారని, మనుస్మృతి ప్రస్తావన లేదు కాబట్టి దీన్ని తాము తిరస్కరిస్తున్నట్లు బహిరంగంగానే నాడు ఆర్.ఎస్.ఎస్ ప్రకటించింది. తర్వాత తాత్కాలికంగా కొంత వెనక్కి తగ్గినట్లు నటించినా హిందూత్వ ఫాసిస్టు శక్తులు భారత రాజ్యాంగ మౌలిక విలువలను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న ఈ శక్తులు రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో దాడి ఎక్కుపెట్టాయి. అందువలన ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగం గురించి అలాగే ఈ రాజ్యాంగాన్ని అమలు చేసే రాజ్యం గురించి కూడా తెలుసుకోవాలి. దీనిపై చర్చ జరగాలి.

రాజ్యాంగం మూడు ముక్కల్లో...

మనది ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన రాతపూర్వక రాజ్యాంగం. ఈ రాజ్యాంగం అంతిమంగా రూపుదిద్దుకోవటానికి దాదాపు రెండున్నర సంవత్సరాల పాటు చర్చలు జరిగాయి. 299 మందితో కూడిన రాజ్యాంగ సభలో ముసాయిదాపై చర్చ చేసిన అనంతరం ఈ రాజ్యాంగాన్ని ఆమోదించడం జరిగింది. భారత రాజ్యాంగంలో మూడు విభాగాలు ఉన్నాయి. ఒకటి పీఠిక. రెండు ప్రాథమిక హక్కులు. మూడు ఆదేశిక సూత్రాలు. ఈ మూడింటినీ విడివిడిగా తెలుసుకోవడమే కాదు. ఈ మూడింటి మధ్య ఉన్న సంబంధంతో కలిపి చూస్తేనే భారత రాజ్యాంగ స్ఫూర్తి, స్వభావం, లక్ష్యం అర్థం అవుతాయి. భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఒక తీర్పులో "రాజ్యాంగాన్ని కేవలం ఒక డాక్యుమెంట్‌గా పరిగణించరాదు. ఒక వీలునామాగానో, ఇద్దరి మధ్య జరిగిన ఒక ఒప్పంద పత్రంగానో చూడరాదు. రాజ్యాంగం జాతి జీవనం యొక్క వాహకం. రాజ్యాంగం ద్వారం కాదు మార్గమని మర్చిపోరాదు. రాజ్యాంగాన్ని రూపొందించే క్రమంలో ప్రతిదీ నిరంతరం మారుతుందని, ఒక వ్యక్తి యొక్క లేదా దేశం యొక్క జీవితం నిశ్చలంగా ఉండకుండా అభివృద్ధి చెందుతూ ఉండాలని నిర్మాతలు భావించారు. రాజ్యాంగం యొక్క మూలాలు గత చరిత్రలోను, వర్తమానంలో దాని కొనసాగింపు ప్రతిఫలించే విధంగానూ, అంతం లేని భవిష్యత్తు వైపు దేశాన్ని నడిపించేదిగాను ఉంటుంది." అని పేర్కొంది. పీఠికలో మొదట, చివర "ప్రజలమైన మేము" అని "ప్రజలుగా మాకు మేము సమర్పించుకుంటున్నామని" వుండటం యాదృచ్ఛికం కాదు. అనేక ఇతర దేశాల రాజ్యాంగాల మాదిరిగా ఎక్కడా భగవంతుని ప్రస్తావన లేదు. ఈ రాజ్యాంగం ప్రజలదని, దాన్ని అమలు చేయించుకోవాల్సింది ప్రజలేనని, మార్చాల్సి వస్తే అది కూడా ప్రజలకుండే హక్కేనని పీఠిక తెలియచేస్తున్నది. ప్రాథమిక హక్కుల్లో పొందుపరచబడ్డ పౌరుల హక్కులు-సమాన హక్కు, అంటే చట్టం ముందు మత, జాతి, కుల, లింగ భేదం లేకుండా అందరూ సమానమే అనడం. అంటరానితనం నిర్మూలన, వాక్ స్వాతంత్ర్యం, సంఘాలు ఏర్పరచుకోవడం, దేశంలో ఎక్కడికైనా సంచరించడం, ఏ పనినైనా ఎంచుకోవడం, ఏ మతాన్నయినా ఆచరించడం, ప్రచారం చేసుకోవడం వంటివి అనేకం ఉన్నాయి. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించిన ఏ పౌరుడైనా, పౌరురాలైనా, సంస్థ అయినా రాజ్యాంగ ధర్మాసనంలో కేసు వేయడం కోసం ఉన్న 32వ అధికరణ అత్యంత విలువైనది. అంబేద్కర్ మొత్తం రాజ్యాంగంలో ఉన్న అధికరణలన్నింటిలో కన్నా అత్యంత విలువైనది ఏది అన్నప్పుడు ఈ "32వ అధికరణ రాజ్యాంగం యొక్క గుండె, ఆత్మ." అని పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగానికి జీవం. రాజ్యాంగం ఆధారంగా పాలక వర్గాలు ఈ దేశంలో పార్లమెంటరీ, గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థని రూపొందించడానికి ఉద్దేశించబడినవే ఈ ఆదేశిక సూత్రాలు.



భారత రాజ్యాంగం, రాజ్యాంగ సభ ముందుకు వచ్చిన సమయంలోనే... ఈ రాజ్యాంగాన్ని తాము అంగీకరించమని, ఇది హిందువులకు ఆమోదయోగ్యం కాదని, ఇది ఒక అతుకుల బొంత అని, తరతరాలుగా భారత సమాజాన్ని నడిపించిన అసలు సిసలు రాజ్యాంగమైన 'మనుస్మృతి'ని ఈ రాజ్యాంగ నిర్మాతలు విస్మరించారని, మనుస్మృతి ప్రస్తావన లేదు కాబట్టి దీన్ని తాము తిరస్కరిస్తున్నట్లు బహిరంగంగానే నాడు ఆర్.ఎస్.ఎస్ ప్రకటించింది. తర్వాత తాత్కాలికంగా కొంత వెనక్కి తగ్గినట్లు నటించినా హిందూత్వ ఫాసిస్టు శక్తులు భారత రాజ్యాంగ మౌలిక విలువలను దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న ఈ శక్తులు రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో దాడి ఎక్కుపెట్టాయి.

ఇంత విలువైన, దూరదృష్టితో కూడిన, వేల సంవత్సరాల మొత్తం భారత సమాజాన్ని రంగరించి రూపొందించిన ఈ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైనదిగా కీర్తించబడుతున్నది. అనేక దేశాలలో రాజ్యాంగాలు అమలులోనే అంతమైపోయాయి. కానీ 74 సంవత్సరాలుగా మన రాజ్యాంగాన్ని నిలుపుకుంటూనే ఉన్నాం. ఇందుకు మరో కారణం కూడా ఉన్నది. భారత రాజ్యాంగాన్ని సమూలంగా రద్దు చేసే అవకాశం లేదు. కానీ అవసరమైన సందర్భాలలో మారిన పరిస్థితులకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఇవ్వబడింది. ఇప్పటికే వందసార్లకు పైగా సవరణలు చేశారు. అయితే మొత్తం రాజ్యాంగాన్నే అంతం చేయడానికి గత 75 సంవత్సరాలుగా హిందూత్వ శక్తులు ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

రాజ్యాంగంపై హిందుత్వ దాడి

1999లో వచ్చిన బిజెపి వాజ్‌పేయి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమీక్షించాలనే భయంకరమైన కుట్రకి తెరలేపింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వెంకటాచలయ్య నేతృత్వంలో ఓ కమిషన్ కూడా వేసేసింది. నిజానికి రాజ్యాంగాన్ని సమీక్షించే హక్కు ప్రభుత్వానికి రాజ్యాంగం ఇవ్వలేదు. కానీ బిజెపి నాటి ఎన్‌డిఎ ప్రభుత్వం వేసిన ఈ కమిషన్ రెండు సంవత్సరాలు చర్చించి 2002లో 1979 పేజీల నివేదికను సమర్పించింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం లేవడంతో వెనక్కి తగ్గింది. కానీ వారి ప్రయత్నాలు మరలా 2014 నుండి ముమ్మరం చేశారు. ఈ దాడి ప్రస్తుతం బహుముఖంగా ఉంది. భారతదేశం పేరుపై వివాదం సృష్టించడం వంటి చులకనైన వాదనల నుంచి పీఠికలో లౌకికవాదం, సామ్యవాదం పదాలు ఎత్తివేయాలనే దాకా బిజెపి వెళ్తోంది. మొత్తంగా భారత రాజ్యాంగాన్ని అంతం చేసి దాని స్థానంలో అతి క్రూరమైన అసమానతలకు, వివక్షతలకు ప్రతిరూపమైన మను ధర్మాన్ని ప్రతిష్టించాలన్నది వారి ఉబలాటం. ఈ క్రమంలో అడ్డగోలుగా తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత రాజ్యాంగం ఒక తీవ్రమైన దాడికి గురవుతున్నది. నిలువరించకుంటే పర్యవసానం భయానకంగా ఉంటుంది.

రాజ్యాన్ని నిలదీయాలి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు రాజ్యాంగం గొప్పతనం గురించి, దానిపై జరుగుతున్న దాడి గురించి, ఈ సందర్భంగా న్యాయస్థానాల తీర్పుల గురించి మాత్రమే చర్చించుకుంటే సరిపోదు. ఈ 74 సంవత్సరాల రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పాలకవర్గాల ప్రయోజనాలు, వాటిని పరిరక్షించుకోవడానికి ఏర్పడిన రాజ్యం గురించి నేడు లోతైన చర్చ జరగాలి. భారత రాజ్యాంగం అమలుకి ఒక రోజు ముందు సభలో ప్రసంగిస్తూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ "26 జనవరి 1950తో మనం ఓ వైరుధ్య భరిత జీవితంలోకి అడుగుపెడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం, సాంఘిక, ఆర్థిక జీవితంలో అసమానతలు. ఈ క్రమంలో ఒకే వ్యక్తి, ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తూనే ఉన్నాం. ఎంత కాలం మన జీవితాల్లో ఈ వైరుధ్యం కొనసాగుతుంది. సాంఘిక ఆర్థిక జీవితాల్లో ఇంకెంత కాలం మనం సమానత్వాన్ని నిరాకరిస్తూ ఉంటాం. ఇలాగే దీర్ఘకాలం కొనసాగిస్తే మనకి మనమే ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తాం. ఈ వైరుధ్యాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నిర్మూలించాలి. లేకుంటే ఈ అసమానత్వంతో బాధపడుతున్న వారు ఈ రాజ్యాంగసభ ఎంతో కష్టపడి రూపొందించిన ఈ ప్రజాస్వామ్య రాజ్యాన్ని బద్దలు కొడతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. దీన్ని బట్టి రాజ్యాంగం కన్నా రాజ్యంపై చర్చ ప్రజాక్షేత్రంలో కేంద్ర బిందువు కావాలి. ఎందుచేతనంటే మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఏంగెల్స్ "పెట్టుబడిదారుల్లోనే కాదు, ఊగిసలాడే సోషల్ డెమోక్రటిక్ శక్తుల్లో కూడా రాజ్యాంగాల మీద అమితమైన మూఢభక్తి వ్యక్తం అవుతున్నది" అన్నారు. అది మన దేశంలో కూడా కనబడుతున్నది. రాజ్యం గురించి కారల్ మార్క్స్ స్పష్టమైన నిర్వచనాన్ని ఏనాడో వెలువరించారు. "రాజ్యం అనేది ఒక వర్గాన్ని మరో వర్గం అణచి వుంచే ఆయుధం తప్ప మరోటి కాదు. ఇది రాచరిక పాలనలో ఎంత నిజమో, ప్రజాతంత్ర గణతంత్ర రాజ్యాల్లో కూడా అంతే నిజం". అని చెబుతూ అమెరికాని ఉదహరిస్తూ అక్కడ "రాజకీయ చట్టా వ్యాపారుల గ్యాంగులు రెండు ఒకదాని తర్వాత ఒకటి రాజ్యాధికారానికి వచ్చి, అత్యంత అవినీతి పద్ధతుల ద్వారా, అత్యంత అవినీతి లక్ష్యాల కోసం దోచుకుంటూనే ఉంటాయి." అని చెప్పిన అంశాలు మన దేశానికి కూడా దాదాపుగా సరిపోతాయి. అంతేకాదు, రాజ్యం గురించి వివరిస్తూ కారల్ మార్క్స్ "పోలీసు, న్యాయ వ్యవస్థ, పరిపాలన వ్యవస్థ వంటివి పౌర సమాజ ప్రతినిధులు కాదు... అవి రాజ్యం యొక్క ప్రతినిధులు. దాని యొక్క కర్తవ్యమల్లా పౌర సమాజానికి వ్యతిరేకంగా రాజ్యం కోసం పని చేయటమే" అంటాడు. "ప్రజాప్రతినిధులను ఓట్లేసే ప్రజల నుండి వేరు చేయడం ద్వారా రాజ్యం నుండి పౌర సమాజాన్ని వేరు చేయడం జరుగుతుంది. ప్రజా సంబంధాలను నిర్వహించే అధికారం ఉన్న ప్రజా ప్రతినిధులు వాస్తవానికి వేరే ప్రత్యేక (దోపిడీ వర్గాల) ప్రయోజనాల కోసం పని చేస్తూ ఉంటారు." అన్నారు. మన దేశంలో కూడా రాజ్యం బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఉందనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన సంవత్సరంలోనే పాలకవర్గాలు సవరించడం ప్రారంభించాయి. 7 సంవత్సరాలు గడవక ముందే కేరళలో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సహించలేక రాజ్యాంగం పేరు చెప్పి కూలదోశారు. తాజాగా ఇ.బి.ఎస్ (ఎలక్టోరల్ బాండ్ స్కీమ్) గురించి చెప్పుకోవచ్చు. 2013లో కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న యుపిఎ ప్రభుత్వం 'ఎలక్టోరల్ ట్రస్ట్ స్కీమ్' రూపొందించింది. దాని ద్వారా కార్పొరేట్ సంస్థలకి, రాజకీయ పార్టీలకి మధ్య బంధాన్ని కనబడకుండా చేయడానికి ఉద్దేశించబడింది. ఇప్పుడు బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరింత పకడ్బందీగా ఇ.బి.ఎస్ ను ప్రారంభించింది. అందుకు విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం (ఎఫ్.సి.ఆర్.ఎ), కంపెనీల చట్టం, ఆర్.బి.ఐ చట్టం, ఆదాయపు పన్ను చట్టం, చివరకు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా 2017 ఫైనాన్స్ చట్టంలో భాగంగా మార్చివేశారు. తాజా లెక్కల ప్రకారం వందల, వేల కోట్లు ముఖ్యంగా అధికారంలో ఉన్న బిజెపి కి అందుతున్నాయి. దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. తీర్పు ఏ విధంగా ఉంటుందో చూడాలి. ఒక విషయం మాత్రం స్పష్టం. రోజురోజుకీ బడా పెట్టుబడిదారులు, గుత్త సంస్థలు, విదేశీ కార్పొరేట్ సంస్థలు తమ ప్రయోజనాల నిమిత్తం ప్రత్యేకించి ఈ సంక్షోభ కాలంలో భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఇందుకు మతోన్మాద ఫాసిస్టు పాలన తోడైంది. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగాన్ని రక్షించాలంటే, దానిని మరింత మెరుగుపరుచుకుంటూ వుండాలి. ఉదాహరణకు రాజ్యాంగంలో సమ్మె హక్కు వంటి వాటిని ప్రాథమిక హక్కుల్లో చేర్చుకుంటూ ముందుకు పోవాలి. భారత పాలక వర్గాల పైన, వారి రాజ్యం పైన పోరాటం తప్పదు.


/ వ్యాసకర్త సిపిఐ(ఎం) కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు /

★

అభిప్రాయం

భారత్ ఓటమి నన్నేమీ బాధ పెట్టలేదు!

అతి జాతీయవాదమే క్రికెట్‌ను నాశనం చేస్తోంది



అవిజిత్ పాఠక్

క్రికెట్ వ్యామోహంతో నిండిపోయిన సమాజానికి చెందిన వ్యక్తిని కాను నేను. వాస్తవానికి, నాకు ప్రత్యేకించి క్రికెట్ అంటే ఇష్టమేమీ లేదని చెప్పగానే నా స్నేహితులు, దగ్గరి బంధువులు నా వంక చాలా విచిత్రంగా, ఆశ్చర్యంగా చూస్తారు. ఒక రకంగా చిరాకుగా కూడా చూస్తారు. చాలా అరుదుగా నేను ఆ క్రికెట్‌ను చూస్తాను. అత్యంత లాభదాయకమైన, మార్కెట్ ఆధారిత పరిశ్రమ స్థాయికి క్రికెట్ క్రీడను కుదించివేయడం నాకు అసహ్యంగా అనిపిస్తుంది. మన 'స్టార్' క్రికెటర్లపై కేంద్రీకృతమైన పురాణాలు, వారి ఆకర్షణీయమైన జీవన శైలి, వారి 'వ్యవహారాలు' లేదా కార్పొరేట్-బాలీవుడ్ సంబంధాలతో వారికి గల సాన్నిహిత్యం ఇవన్నీ నన్ను ఆకర్షించవు. పైగా, క్రికెట్‌ను ఒక రకమైన యుద్ధంగా, అంతర్జాతీయ మ్యాచ్‌లో విజయాన్ని సర్జికల్ దాడులతో సరిపోల్చేంత 'జాతీయవాది'గా నేను ఇంకా మారలేదు.

ఆదివారం, బయటి వ్యక్తి తరచుగా ఎదుర్కొనే ఒంటరితనం యొక్క తీవ్రత ఎలా వుంటుందో నేను అనుభవించాను. ప్రపంచ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా, భారత్‌ను ఓడించింది. అయినా, నేనేమీ గుండెలవిసేలా ఏడవలేదు. నా హృదయం కల్లోలం కాలేదు. నేను గాయపడేంతగా నాలో 'జాతీయవాద' అహం (ఇగో) లేదు. బదులుగా, ఆ ఓటమిని నేను చాలా లైట్‌గా తీసుకున్నాను. బాగా నిద్రపోయాను కూడా. అయితే, అసలే ప్రపంచ కప్ ఫైనల్‌లో ఓడిపోయి, దేశ ప్రజలందరూ సామూహికంగా విచారం వ్యక్తం చేస్తూ వున్న తరుణంలో, 'జాతి'గా పిలిచే కొత్త దేవుడిని ఆరాధించడానికి క్రికెట్‌ను ఒక తాంత్రిక పూజ స్థాయికి కుదించిపారేసిన వారితో నా భావాలను పంచుకోవడం అంత సులభమేమీ కాదని నాకు తెలుసు. ఎలాంటి ప్రేమ, అభిమానాలు చూపని నా తీరును, విలువ ఇవ్వని నా తటస్థ వైఖరిని వారు అసహ్యించుకోవచ్చు కూడా. నా జాతీయవాద ప్రామాణికాలను కూడా వారు శంకించవచ్చు, అయినప్పటికీ, క్రికెట్ వ్యామోహాలతో నిండిపోయిన సమాజంలో నేనొక బయటి వ్యక్తిగా బతకడం అంత సులభమేమీ కాదు.


ఇంత ఒంటరితనం వున్నప్పటికీ, ఇలా క్రికెట్‌కు బయటివాడుగా వుండడం కూడా కొంత లాభదాయకమే. ఎలా అంటే, మన స్టార్ క్రికెటర్లు (నిరంతరంగా ఏదో ఒక ఉత్పత్తికి బ్రాండ్ అంబాసిడర్లుగా వుండే వారు వివిధ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసేలా చూసేందుకు, వాటిని నమ్మించేందుకు ప్రయత్నిస్తూ వుంటారు) నన్ను హిప్నటైజ్ చేయడానికి అనుమతించను. క్రికెట్ పేరుతో జరుగుతున్న దాన్నంతా నేను తీవ్రంగా, పదునుగా విమర్శించగలను. ఇది వారి దేశాభిమానం కాదు, దానికి బదులుగా, వారి హావభావాల్లో, ప్రాక్టీస్‌ల్లో 'నగదు చెల్లింపు' మ్యాజిక్‌ను చూడగలను. మనుషుల్లో స్వార్థాన్ని తప్ప మంచిని చూడని వ్యక్తి(సినిక్)ని అంటూ మీరు నన్ను నిందించినా సరే, ఈ తరహా క్రికెట్ ముఖ్యంగా వ్యాపారం తప్ప మరొకటి కాదన్న విషయాన్ని అయితే నేను మరిచిపోను.

ఉదాహరణకు చూసినట్లైతే మనవంటి దారిద్ర్యంతో బాధపడే దేశంలో విరాట్ కోహ్లి ఐపిఎల్ కెరీర్ ద్వారా ఇప్పటికే రూ.126 కోట్లు సంపాదించాడు. ఐపిఎల్ 2023 వేలానికి సంబంధించి రోహిత్ శర్మ మార్కెట్ విలువ రూ.16 కోట్లు! పైగా ఇండియా ఛేంజ్ ఫోరమ్ ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం, ఎన్ని నియంత్రణా ఆంక్షలున్నప్పటికీ భారత్‌లో క్రికెట్ బెట్టింగ్, గాంబ్లింగ్ మార్కెట్ గణనీయమైన రీతిలో అభివృద్ధి చెందింది. 2023 చివరి నాటికి ఈ మార్కెట్ విలువ 200 కోట్ల అమెరికన్ డాలర్లు వుంటుందని అంచనా వేయబడింది. టీనేజర్లు, విద్యార్థి, యువత సహా 34 కోట్ల మందికి పైగా భారతీయులు ఈ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనడం మంచి విషయమో కాదో నిర్ణయించాల్సింది మనమే. వాస్తవానికి, ఈ క్రికెట్ స్టార్లందరూ నిస్వార్థులైన దేశాభిమానులని, మన దేశానికి బేషరతుగా సేవ చేస్తున్నారని చిత్రీకరించడం తెలివితక్కువతనమే కాగలదు. ప్రపంచ కప్ రన్నరప్‌గా భారత బృందానికి దాదాపు రూ.16 కోట్ల నగదు బహుమతి అంతర్జాతీయ క్రికెట్ మండలి నుండి వస్తుందనే విషయం మరిచిపోరాదు. మీరు, నేను మన 'రక్షకుడు'గా విలువనిచ్చే, కార్గిల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైనిక జవాను వేతనం స్కేలుతో దీన్ని పోల్చి చూడండి. అలాగే, క్రికెట్ ప్రపంచానికి బయటి వ్యక్తిగా, పురుష జాతి ఇగోను పెంచేందుకు ఒక వ్యూహంగా క్రికెట్‌ను ఉపయోగించే రాజకీయాలను కూడా నేను చూడగలను. భారత్, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను ఒక యుద్ధం స్థాయికి కుదించే విషపూరితమైన టెలివిజన్ వార్తా చానెళ్ళు వుండడాన్ని మనం చూస్తున్నాం. ఇందులో ఇమిడి వున్న వికారం గురించి ఆలోచించండి. ఈ క్రికెట్ యుద్ధంలో 'జై శ్రీరామ్' అంటూ పెద్ద పెట్టున నినదించడమే మన ఆయుధంగా మారినట్లైతే, మన సమిష్టి క్షీణతను, మన క్రూరమైన ప్రవృత్తులను, ఆత్మవిశ్వాసం లేని మతాన్ని, ఆటను ఆటగా చూడలేని మన నిస్సహాయతను అది వెల్లడిస్తుంది. పాకిస్తానీ క్రికెటర్ సృజనాత్మక నైపుణ్యాలను ప్రశంసించడం ఈ రోజుల్లో ఇబ్బందికరంగా మారిందంటే మనల్ని జాతి వ్యతిరేకిగా ముద్ర వేస్తారేమోననే భయం వుండడమే కారణమా? అటువంటపుడు, భారత్, పాకిస్తాన్‌లు క్రికెట్ ఆడుతున్నపుడు, అతిగా జాతీయ భావాలు చెలరేగడమే అన్ని రకాల మానసిక, సాంస్కృతిక దురాక్రమణలకు కారణమవుతోందంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

బహుశా, ఈ తరహా క్రికెట్ జాతీయవాదం పట్ల నాకు గల అసౌకర్యమే నన్ను కాపాడి వుంటుంది. ఆస్ట్రేలియా భారత్‌ను ఓడించింది. ఈ ఓటమి నన్ను బాధ పెట్టకుండా, వినయానికి సంబంధించిన అతి ముఖ్యమైన పాఠాన్ని నాకు నేర్పింది. అద్భుతమైన నరేంద్ర మోడీ స్టేడియం, ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, వేలాదిమంది అభిమానులు వుండడం, అన్ని రకాల పూజలు, యజ్ఞాలు జరగడం ఇవన్నీ వున్నా, భారత్ విజయాన్ని సాధించలేకపోయింది. ఈ ఓటమి మనకు ఇవ్వాలనుకుంటున్న సందేశం అర్థమేమిటో గ్రహించడానికి మనం సిద్ధంగా వున్నామా? ప్రతీదీ అశాశ్వతమేనని ఇది మనకు బోధించింది. నీ విజయం గానీ ఓటమి గానీ ఏదీ శాశ్వతం కాదు. ఈనాడు మీరు హీరో, రేపు మీరు జీరోకు పడిపోవచ్చు! అందువల్లే, ఈ ఓటమిని మనం అత్యంత హుందాగా స్వీకరించాలి, ఆమోదించాలి. అంతేగానీ మాస్ హిస్టీరియాతో లేదా సమిష్టి అవమానంతో కాదు. అలాగే, మన 'ఇగో', అది జాతీయవాదం పేరుతో పవిత్రం చేయబడినా కూడా ఒక భ్రమే. క్రికెట్‌ను సర్జికల్ దాడి స్థాయికి తగ్గించాలనుకుంటున్న యోధులందరికీ బహుశా, ఈ ఓటమి ఒక సందేశాన్ని ఇస్తోంది. వారందరినీ హుందాగా వ్యవహరించమని కోరుతోంది. ఆటను ఆటగానే చూడాలంటోంది. సమరశీల జాతీయవాదమనే అద్దాలు వారు చూసే తీరును ఎలా వక్రీకరిస్తున్నాయో అర్థమవుతోంది. అంతర్జాతీయ సంఘీభావం, ఏకత్వమనే భావనను సెలబ్రేట్ చేసుకోవాలని చెబుతోంది.

/ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో/

పసుపుతో సహా అన్ని రంగులను గౌరవించండి.
'మీ వైఫల్యాలను సైతం హత్తుకోవడం' నేర్చుకోండి.



జనవాక్యం

కుల గణన...

కులగణన అని కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించి దేశంలో తొంభై ఏళ్లు దాటింది. అప్పుడున్న 30 కోట్ల జనాభాకు 100 కోట్లు అదనంగా చేరింది. అయినా ఉజ్జాయింపుగా కులాల లెక్కలు వేస్తున్నాం. 2011లో మళ్లీ కులాలవారీ లెక్కలు వేసినా, ఆ ప్రక్రియలో లోపాలున్నాయని ప్రభుత్వం భావించి, వాటిని దాచిపెట్టి అందులో ఆర్థిక స్థితిగతుల్ని మాత్రమే బయట పెట్టింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు కులగణనకు పూను కొంటున్నాయి. బీహార్ మాత్రం ఆ పని పూర్తి చేసి, అక్కడ బలహీన వర్గాలకు ఇస్తున్న రిజర్వేషన్లను కూడా సవరించింది. కేంద్రంలో పాలక పక్షం బిజెపి కి ఇలా కులగణన చెయ్యడం ఇష్టం లేకపోయినా బీహార్‌లో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అందుకు మద్దతు తెలిపింది. కుల రహిత సమాజంగా ఏర్పడడం ఒక ఆదర్శం. అయితే సమాజంలో కుల గుర్తింపు ఉందన్న వాస్తవాన్ని ఒప్పుకొని ముందుకెళ్లడం ఆవశ్యం. వేల కులాలున్న సమాజాన్ని వాటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక స్థితిగతుల బట్టి నాలుగైదు వర్గాలుగా చూడాలి. షెడ్యూల్డ్ కులాలు, తెగలతోబాటు వెనుకబడిన వర్గాల్ని గుర్తించడం... వారి ముందడుగు కోసం ప్రయత్నించినప్పుడే సమసమాజం ఏర్పడే వీలుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా కులాల స్థితిగతుల మీద అధ్యయనాలు జరపడానికి కులగణన మొదటి మెట్టు. లక్షిత పథకాలు అమలు చేస్తూ, సంతృప్త స్థాయిలో అన్ని వర్గాల్నీ అభివృద్ధి దిశగా నడిపించడం ప్రభుత్వ లక్ష్యం కావాలి. అందుకోసం లోపరహితంగా కులగణన చేపట్టాలి.

- డా.డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
పార్వతీపురం.

జెఇఇ అడ్వాన్స్‌డ్ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: దేశంలోని ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ ఈ పరీక్షను మే 26న (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఐఐటీ మద్రాస్ శుక్రవారం ప్రకటించింది. జెఇఇ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఏప్రిల్ 21 నుంచి ఏప్రిల్ 30 సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫీజు చెల్లింపునకు మే 6వరకు అవకాశం కల్పించారు. మే 17 నుంచి మే 26 వరకు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 పరీక్ష మే 26న జరుగనుంది. పేపర్ -1 ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, పేపర్- 2 మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఉంటుంది. ప్రొవిజనల్ ఆన్సర్ కీ జూన్ 2న విడుదల చేస్తారు. ప్రాథమిక కీపై జూన్ 2 నుంచి 3 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. తుది కీ, ఫలితాలను జూన్ 9న విడుదల చేస్తారు. అలాగే, ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు జూన్ 9 నుంచి 10 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. జోసా ద్వారా ఐఐటీల్లో సీట్ల కేటాయింపు ప్రక్రియ జూన్ 10 నుంచి ప్రారంభించే అవకాశం ఉంది. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను జూన్ 12న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ 15న ప్రకటిస్తారు.

6 రాష్ట్రాల్లోనే 50 శాతం ఉపాధి హామీ ఆడిట్

- వంద శాతం పూర్తి చేసిన కేరళ
- నిధులు కొరతే ఆడిట్ ఆలస్యానికి కారణమంటున్న రాష్ట్రాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని మొత్తం 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కేవలం ఆరు రాష్ట్రాల్లో మాత్రమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) పనుల సామాజిక తనిఖీలు పూర్తయింది. 100 శాతం గ్రామ పంచాయతీలను ఆడిట్ ను పూర్తి చేసిన ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచింది. సామాజిక తనిఖీ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయనందున ఆడిట్ ఆలస్యం అవుతుందని రాష్ట్రాలు పేర్కొన్నాయి. ఉపాధి హామీ పథకం అమలులో వచ్చిన ప్రాథమిక ఫిర్యాదులలో అవినీతి కూడా ఒకటి. సామాజిక తనిఖీ అనేది ఈ చట్టంలో అంతర్నిర్మిత అవినీతి నిరోధక యంత్రాంగం. ఈ నెల 10 వరకు రాష్ట్రాల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఆడిట్ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన సోషల్ ఆడిట్‌లో మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) నుండి సేకరించబడ్డాయి. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నిర్దేశించిన ఆడిటింగ్ ప్రమాణాలు 2016 డిసెంబర్ 19న జారీ అయ్యాయి. దీని కింద, ప్రతి సోషల్ ఆడిట్ యూనిట్‌కు మునుపటి సంవత్సరంలో రాష్ట్రం చేసిన ఉపాధి హామీ వ్యయంలో 0.5 శాతానికి సమానమైన నిధులు కేటాయించాలి. ఆడిట్‌లో



ఉపాధి హామీ కింద చేసిన మౌలిక సదుపాయాల నాణ్యత తనిఖీలు, వేతనాలలో ఆర్థిక దుర్వినియోగం, విధానపరమైన లోపాలను తనిఖీ చేయడం వంటివి ఉంటాయి.

వివిధ రాష్ట్రాల్లో ఆడిట్

కేరళ తరువాత బీహార్ (64.4 శాతం), జమ్ముకాశ్మీర్ (64.1 శాతం), ఒడిశా (60.42 శాతం), గుజరాత్ (58.8 శాతం), ఉత్తరప్రదేశ్ (54.97 శాతం) రాష్ట్రాలు 50 శాతం మార్కును దాటాయి. తెలంగాణ (40.5 శాతం), హిమాచల్ ప్రదేశ్ (45.32 శాతం), ఆంధ్రప్రదేశ్ (49.7 శాతం) మూడు రాష్ట్రాలు మాత్రమే 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ గ్రామ పంచాయతీల్లో ఆడిట్ పూర్తి చేశారు. తెలంగాణ కాకుండా, ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ (1.73 శాతం), మిజోరం (17.5 శాతం), ఛత్తీస్‌గఢ్ (25.06 శాతం), రాజస్థాన్ (34.74 శాతం) ఆడిట్ చేశాయి.

కేంద్రం నిధులు ఇవ్వకపోవడంతో ఆడిట్ ఆలస్యం

సామాజిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించకపోతే, ఉపాధి హామీ కింద నిధులు నిలిపివేయబడతాయని కేంద్ర ప్రభుత్వం అనేకసార్లు రాష్ట్రాలను గుర్తు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పని చేసే సోషల్ ఆడిట్ యూనిట్లకు కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఆడిట్ ఆలస్యమవుతోందని రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తున్నాయి. గ్రామస్థాయి ఆడిటర్లకు జీతాలు ఆలస్యం అవుతున్నాయని పదే పదే ఫిర్యాదులు వస్తున్నాయి.

గ్రామ స్థాయిలో సోషల్ ఆడిట్ : ఎంబి రాజేష్

దేశ మొత్తంలో కేరళలో మాత్రమే పంచాయతీ స్థాయిలో సోషల్ ఆడిట్ ప్రక్రియ జరుగుతున్నాయని ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎంబి రాజేష్ తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో, ఉపవిభాగ పబ్లిక్ హియరింగ్ డివిజనల్ స్థాయిలో మాత్రమే చేయబడుతుందని అన్నారు. "మేము మా సోషల్ ఆడిటింగ్ మెకానిజంను పటిష్టంగా చేయడానికి అనేక చర్యలు తీసుకున్నాము. అందులో భాగంగా పంచాయితీ స్థాయి పబ్లిక్ హియరింగ్‌లను నిర్వహించడంతోపాటు భాగస్వామ్యులందరూ పాల్గొంటారు. ఏది ఏమైనప్పటికీ, కేరళ పాలనలో ప్రజల భాగస్వామ్యం ఆరోగ్యకరమైన సంస్కృతిని కలిగి ఉంది" అని మంత్రి రాజేష్ అన్నారు.

తుది దశలో రెస్క్యూ ఆపరేషన్

- ఉత్తరాఖండ్ సిఎం ధామీ వెల్లడి



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ టన్నెల్ కుప్పకూలి అందులో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే చర్యలు తుది దశలో ఉన్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. ఈనెల 12న సొరంగం కూలిపోయి 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 13 రోజుల పాటు కార్మికులు అందులోనే భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉంటున్నారు. అయితే, కార్మికులను రక్షించే క్రమంలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. డ్రిల్లింగ్ పనులకు గుర్తు తెలియని ఇనుప పట్టీ తాకటం, దానిని గ్యాస్ కట్టర్‌తో తొలగించాక పనులు మళ్లీ మొదలు కావటం జరిగాయి. ఇలాంటి అవాంతరాలు, అంతరాయాల నేపథ్యంలో కార్మికుల కోసం బోర్డ్ గేమ్స్, పేక ముక్కలను రెస్క్యూ టీమ్‌లు అందిస్తున్నాయి. "లూడో, చెస్ బోర్డు, పేకముక్కలు వంటి వాటిని చిక్కుకున్న కార్మికులకు అందించాలనుకుంటున్నాం. దీంతో వారికి ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆపరేషన్ ఆలస్యమవుతున్నది. ఇందుకు ఇంకా సమయం పట్టేలా కనిపిస్తున్నది" అని ఘటనా స్థలం వద్ద ఉన్న ఒక మానసిక వైద్యులు డాక్టర్ రోహిత్ గోన్‌డ్వాల్ తెలిపారు. కాగా, అంతకముందు మధ్యాహ్నం సమయంలో సిల్క్యారా టన్నెల్ సైట్ వద్ద కొనసాగుతున్న రక్షణ చర్యలను పర్యవేక్షించటానికి కేంద్ర మంత్రి వి.కె సింగ్ అక్కడకు చేరుకున్నారు.

బర్రెలక్కకు భద్రత కల్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిరీష అలియాస్ బర్రెలక్కకు రక్షణ కల్పించాలని హైకోర్టు రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. తాను ప్రచారం చేయకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని, తన సోదరుడిపై దాడి చేశారని, అయినప్పటికీ పోలీసులు రక్షణ కల్పించలేదంటూ బర్రెలక్క దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ సివి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అభ్యర్థుల రక్షణ బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేసింది. కార్లు తనిఖీలు చేయడమే కాదు.. అభ్యర్థులకు రక్షణ కూడా కల్పించాలని పేర్కొంది. పోలీసులు రక్షణ కల్పించలేమని చెబితే తాము ఇసి ద్వారా కేంద్ర బలగాలను రక్షణగా ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఇవ్వాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ అభ్యర్థులకు రక్షణ కల్పిస్తున్నట్టు పోలీసుల తరఫున తెలియజేశారు.

డిగ్రీ చదివి ఉద్యోగం లేక బర్రెలతో ఉపాధి పొందుతున్న శిరీష గురించి సోషల్ మీడియాలో రావడంతో ఆమెకు లక్షల మంది ఫాలోవర్స్ తయారయ్యారు. తానలాంటి నిరుద్యోగులు పడుతున్న అవస్తలతో పాటు కొల్లాపూర్ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను ప్రశ్నిస్తూ ఆమె ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగారు. బర్రెలక్క నామినేషన్ వేస్తున్న విషయం తెలియగానే.. ఆమె ఫాలోవర్స్, నిరుద్యోగులు, ప్రొఫెసర్లు, లాయర్లు, అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ఇదే సమయంలో ఆమెకు అనేక విధాలుగా అడ్డంకులు వచ్చాయి. బర్రెలక్క కుటుంబ సభ్యులతో పాటు ఆమెకు సహకరిస్తున్న వారిపై దాడులు జరగడంతో ఆమె రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

రాజస్థాన్‌లో నేడు పోలింగ్

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో మొత్తం 200 నియోజకవర్గాలు ఉండగా.. ప్రస్తుతం 199 స్థానాలకు ఒకేరోజు పోలింగ్ జరగనుంది. కరణ్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ కనూర్ ఆకస్మిక మరణంతో ఆ నియోజకవర్గంలో పోలింగ్ వాయిదా పడింది. 199 స్థానాల్లో మొత్తం 5,25,38,105 మంది మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. ప్రస్తుతం దేశంలో ఐదు రాష్ట్రా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే శుక్రవారం రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల్లో ఎన్నికలు జరిగాయి. శుక్రవారం రాజస్థాన్ ఎన్నికలతో నాలుగు రాష్ట్రాలకు ఎన్నికలు పూర్తవుతాయి. తెలంగాణలో ఈ నెల 30న ఎన్నికలు జరుగుతాయి. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను డిసెంబరు 3న ప్రకటిస్తారు. కాగా, రాజస్థాన్‌లో సుమారు 45 రోజుల పాటు రాజస్థాన్ ఎన్నికల ప్రచారం జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవాలని పట్టుదలగా ఉంది.

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

ప్రజా సమస్యలపై ప్రశ్నించే

కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపండి

(మొదటిపేజీ తరువాయి)

పోరాటాలను అణచి వేయాలని చూస్తోందని, పౌర హక్కులను కాలరాస్తోందని, రాజ్యాంగంపైనా దాడి చేస్తోందని, మీడియానూ స్వేచ్ఛాయుతంగా పనిచేసుకోనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపికి బిఆర్‌ఎస్ పాలన కూడా ఏ మాత్రమూ మినహాయింపు కాదన్నారు. రాష్ట్రంలోనూ నిరుద్యోగం బాగా పెరిగిందని, షెడ్యూల్ కులాలకు ఇచ్చిన హామీల అమలులో బిఆర్‌ఎస్ ప్రభుత్వం వైఫల్యమైందని విమర్శించారు.

ప్రయివేటు, కార్పొరేట్ల చేతుల్లోకి విద్య, వైద్య రంగాలు వెళ్లిపోయాయన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న యర్రా శ్రీకాంత్‌ను, పాలడుగు భాస్కర్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. ఖమ్మం రోడ్డు షోలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులపై కరువు కాటు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మిగనూరు, నందవరం, హొళగుంద, పెద్దకడబూరు మండలాల నుంచి వలసలు అధికంగా ఉన్నాయి. సుమారు 50 వేల మంది వరకు వలసపోయినట్లు అంచనా, వీరిలో ఒక్క కొసిగి మండలం నుంచే 30 వేల మంది వరకూ ఉన్నారు. పిల్లలతో సహా కుటుంబాలు వలస వెళ్లడంతో తరగతి గదులు వెలవెలబోతున్నాయి. కోసిగి మండలంలో 16,166 మంది విద్యార్థులు ఉండగా, తొమ్మిది వేల మంది మాత్రమే ప్రస్తుతం హాజరవుతున్నారు. . పెద్దకడబూరు మండలంలో 10,769 మందికి ఏడు వేల మంది మాత్రమే పాఠశాలలకు వస్తున్నట్లు సమాచారం, కౌతాళం మండలంలో 14,595 మందికి సుమారుగా పది వేల మంది హాజరవుతున్నారు. అమ్మఒడి పథకానికి 75శాతం హాజరు తప్పనిసరి అన్న సంగతి తెలిసిందే. మరో మార్గం లేక, తల్లిదండ్రులతో వలస వెడుతున్న విద్యార్థులు ఆ పథకానికి దూరం కాక తప్పనిస్థితి నెలకొంది.

హాజరు శాతం తగ్గింది

మా పాఠశాలలో మొత్తం 469 మంది విద్యార్థులకుగాను ప్రస్తుతం 170 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. వలస వెళ్లిన తల్లిదండ్రులు పిల్లలను వారి వెంట తీసుకెళ్లారు. దీనివల్ల దాదాపు 64 మేరకు హాజరు శాతం తగ్గింది. వారంతా చదువుకు దూరమవుతున్నారు.

– కె.సంజన్న, హెచ్‌ఎం, కోసిగి బాలికల ప్రాథమిక పాఠశాల.

ప్రభుత్వానికి నివేదించాం

వలస వెళ్తున్న విద్యార్థులను గుర్తించాలని ప్రధానోపాధ్యాయులకు, ఎంఇఒలకు చెప్పాం. సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. వలస వెళ్తున్న కుటుంబంలోని విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో ఉండేందుకు ఇష్టపడితే వారికి చేర్పించేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకుంటారు. విద్యకు ఎవరూ దూరం కాకూడదు అనేదే మా లక్ష్యం.

–వెంకట రంగారెడ్డి, కర్నూలు డిఇఒ

జర్మనీలో హెల్త్‌కేర్ కార్మికుల సమ్మె

బెర్లిన్ : జర్మనీలోని హెల్త్‌కేర్ రంగ కార్మికులు గురు, శుక్రవారాల్లో రెండు రోజుల సమ్మెను నిర్వహించారు. సమ్మె ప్రభావం ఆసుపత్రులపై.. ముఖ్యంగా విశ్వ విద్యాలయాల ఆసుపత్రులపై ప్రధానంగా పడింది. అనేక శస్త్రచికిత్సలను రద్దు చేయాల్సి వచ్చింది. కార్మికులు కనీసం తమ వేతనాన్ని కనీసం 10 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు భాగస్వామ్యమయ్యారని యునైటెడ్ సర్వీసెస్ ట్రేడ్ యూనియన్ (వెర్డి) ఒక ప్రకటనలో తెలిపింది.



అడవికి ముప్పు




ఒక రోజు సిద్ధు ఉండే వీధిలో డప్పు శబ్దం వస్తుంది. 'మన గ్రామ పరిసరాలలో పెద్దపులి జాడలు కనబడుతున్నాయి. అందరూ తోటలకు, పొలాలకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించండి. ఒంటరిగా వెళ్ళవద్దు. రాత్రుల్లో బయట సంచరించవద్దు. పులిజాడలు కనబడితే వెంటనే అటవీశాఖకు తెలియజేయగలరు' అని తలయారీ కేశవుడు టాంటాం వేస్తూ, గట్టిగా అరిచి చెబుతున్నాడు. నరసింహ మాస్టారు ఇంటి దగ్గరికి వచ్చేసరికి కేశవుడు ఒక కాగితంపై సంతకం పెట్టమని ఆయనకి ఇచ్చాడు. కాగితంపై మాస్టారు సంతకం చేశారు. మాస్టారు పక్కనే కూర్చుని ఉన్న ఆయన మనవడు సిద్ధు, 'తాతయ్య! పులి అడవిలో సంచరించాలి కదా! మన గ్రామం వైపు ఎందుకు వచ్చేసింది?' అని అడిగాడు.

'సిద్ధు! పులి అటవీ ప్రాంతంలో ఉండాలి. కానీ మనుషులమైన మనం రోజురోజుకీ అడవులను నరికి వేస్తున్నాము. అటవీ విస్తీర్ణం తగ్గిపోతుంది. జంతువులకు ఆవాసాలు కరువు అవుతున్నాయి. వాటికి ముప్పు కలిగిస్తున్నాం. అందుకే అవి గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి' అని మాస్టారు సిద్ధుకి అర్థమయ్యేలా చెప్పారు. అడవులను రక్షించవలసిన బాధ్యత ఎవరిది?' తాతయ్య అని అమాయకంగా అడిగాడు సిద్ధు. 'అది ఏ ఒక్కరి బాధ్యతో కాదు. అడవుల సంరక్షణ సమిష్టి బాధ్యత. మనమంతా అడవుల రక్షణకు నడుం కట్టాలి. అప్పుడే అడవిలో జీవులకు రక్షణ ఉంటుంది. మనకు కూడా వాతావరణం బాగుండి, సకాలంలో వర్షాలు పడతాయి. పంటలు పండుతాయి' అని ఎంతో ఓపికగా మనవడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు మాస్టారు. 'నిజమే తాతయ్య! అందరూ ఈ విషయాన్ని తెలుసుకొని మెలగాలి. అటవీ విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలి. అప్పుడే ఆనందంగా జీవించగలం. నేను ఈ విషయాన్ని మా స్కూల్లో పిల్లలందరికీ చెబుతాను' అంటూ స్కూలుకి బయల్దేరాడు సిద్ధు.


- మొర్రి గోపి,
94945 90820.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఈ రెండు బొమ్మల్లో మూడు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





కె.ప్రభాకర్,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్ కుల్చారం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family



'నేను నిరుద్యోగుల గొంతుకను. పేదింటి ఆడపిల్లను. ఉద్యోగం కోసం కోచింగ్‌సెంటర్ల చుట్టూ పరుగులు పెట్టే అన్నలు, అక్కల్లో నేనొకదాన్ని. కొలువు కోసం తినీ తినక ఊళ్లో పోగేసుకున్న సొమ్ములు, అప్పులు చేసి పట్నానికి పయనమైన దాన్ని. ఎలాగైనా ఉద్యోగం కొట్టాలన్న లక్ష్యంతో ఆకలితో పస్తులున్న వారందరికీ ప్రతినిధిని' అంటున్న కె.శిరీష (అలియాస్ బర్రెలక్క), ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల బరిలో కొల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. డబ్బు లేదు, బలగం లేదు. ఏ రాజకీయ పార్టీ అండలేదు. రోజుకూలీతో పొట్టనింపుకునే కుటుంబం. అయినా ఆమె రాజకీయాల్లోకి ఎందుకు అడుగుపెట్టింది? ఆమెని ఇంతలా ప్రభావితం చేసిన అంశాలేంటి? చూద్దాం..

నేను నిరుద్యోగుల గొంతుకను...

'నేను పుట్టి పెరిగింది నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం, మరికల్ గ్రామం. చిన్నప్పుడే నాన్న మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయాడు. నాన్న కోసం ఎంతో ఏడ్చాను. మా కోసం అమ్మ పడే కష్టం చూడలేక ఇంటికి రమ్మని ఎన్నోసార్లు పిలిచాను. అయినా నాన్న రాలేదు. అమ్మ టిఫిన్ సెంటర్ పెట్టుకుని మమ్మల్ని పెంచింది. ఇద్దరు తమ్ముళ్లు. ఊళ్లో ఉన్న స్కూల్లో ఏడో తరగతి వరకు చదివాను. కస్తూర్బా హాస్టల్లో పదో తరగతి పూర్తిచేశాను. నారాయణ ఖేడ్ కాలేజీలో అగ్రికల్చర్ డిప్లొమా చదివాను. ఇంటర్ చదివితేనే ఉద్యోగం వస్తుంది అన్నారు. మళ్లీ ఇంటర్ చదివాను. డిగ్రీ పూర్తి చేశాను. పోలీసు జాబ్ కోసం ప్రయత్నించాను. ఉద్యోగం రాలేదు. ఏం చేయాలో పాలుపోలేదు. అమ్మకు సాయంగా ఉందామని ఎంతో తపించాను. ఏదైనా ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డాను. ఏదీ జరగలేదు. అప్పుడే బర్రెలను కాచి ఆ సొమ్ముతో అమ్మకు అండగా నిలబడాలనుకున్నాను. నాలుగు బర్రెలు కొన్నాను. పగలంతా వాటిని మేపేదాన్ని. ఉదయం, సాయంత్రం పాలు అమ్మేదాన్ని. అప్పుడే ఓ వీడియో చేశాను. **'ఎంత చదివినా డిగ్రీలు, మెమోలు వస్తున్నాయి కానీ ఉద్యోగం రాలేదు ఫ్రెండ్స్. అందుకే, ఇగో ఈ బర్రెలు కాస్తున్నా' అని ఓ 30 సెకన్ల వీడియో చేసి ఇన్‌స్టాలో షేర్ చేశాను.** అది బాగా వైరల్ అయ్యింది. యూట్యూబ్‌లో కూడా చాలామంది చూశారు. అదే నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది. ఆ వీడియో తరువాత కొందరూ నన్ను 'బర్రెలక్క' అని ట్రోల్ చేశారు' అని తన ప్రయాణం గురించి శిరీష వివరించారు. ఈ వీడియో తరువాత ఆమెపై సుమోటాగా కేసు నమోదైంది.

ఇప్పుడు తృప్తిగా ఉంది..

'నా బిడ్డ ఎంతో కష్టపడుతుంది. పెద్దదిక్కు లేని కుటుంబమని నాకు సాయంగా ఉండాలని ఎప్పుడూ ఆలోచించేది. పెనిమిటి పట్టించుకోక పోవడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ని నడుపుకుంటూ పిల్లలను పెంచాను. డేరాలు కట్టుకుని, రేకుల కప్పు ఉన్న ఓ చిన్న ఇల్లు మాది. పిల్లలు ప్రభుత్వ బళ్లోనే చదివారు. పెద్ద చదువులు చదివించే స్థోమత లేదు. ఉపాధి కోసం శిరీష ఎన్నో ప్రయత్నాలు చేసింది. నాతో పాటు టిఫిన్ సెంటర్‌లో


ప్రచార సభలో

పనిచేసేది. ఉద్యోగం కోసం పట్నం పోవడం, పరీక్షలు రాయడం, ఇదే పనిగా పెట్టుకుంది. పోలీసు శాఖలో ఉద్యోగం చేయాలని కలలుగంది. జాబ్ రాలేదు. అయినా నిరుత్సాహ పడలేదు. బర్రెలు కాసి, కుటుంబానికి సాయంగా ఉండేది. అప్పుడు చేసిన వీడియోనే ఇప్పటి మా పరిస్థితికి కారణమవుతుందని మేమసలు ఊహించలేదు. ఆ వీడియోను లక్షలాది మంది ఫాలో అయ్యారు. ఇదే పాలకులకు నచ్చలేదు. ప్రభుత్వాన్ని కించపర్చేలా ఆ వీడియో ఉందని ఆమెపై కేసు పెట్టారు. ఎవరు పెట్టారో.. ఎందుకు పెట్టారో తెలియకుండానే ఇప్పటివరకు కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. మాపై కేసు పెట్టిన సారు ఎవరో మాకు తెలియదు. పోలీసులు కూడా చెప్పలేదు. కోర్టుకు మాత్రం వెళుతున్నాం. సుమోటోగా కేసు తీసుకున్నారని చెప్పారు. అసలు ఎవరు పెట్టారో తెలియాలి కదా? అదే విషయం అడిగితే 'డిపార్టుమెంటు నుండి ఒత్తిడి ఉందమ్మా అని మాట దాటేశారు. మాకు ఆస్తులు లేవు. అండ లేదు. ఎన్నో పాట్లు పడ్డాం. ఇగో ఇప్పుడు మళ్లీ నా బిడ్డ నామినేషన్ వేస్తే ఎవరెవరో.. ఎక్కడెక్కడి నుండో పెద్ద సార్లు వస్తున్నారు. ఇప్పుడు నాకు చాలా సంతోషమేస్తోంది. నా బిడ్డకు అండగా ఇప్పుడు ఇంతమంది తోడున్నారని తృప్తిగా ఉంద'ని శిరీష తల్లి అనురాధ చెబుతున్నారు.


శిరీష తల్లి అనురాధ

నామినేషన్ ఎందుకు వేశానంటే..

'మాలాంటోళ్లు ఉపాధి కోసమే ఉన్నత చదువులు చదువుతున్నారు. స్థోమత లేకున్నా కోచింగ్ సెంటర్లకు వెళుతున్నారు. అగో నేను కూడా అలాగే వెళ్లాను. కడుపుమాడ్చుకుని ఫీజు కట్టాను. నోటిఫికేషన్లు పడలేదు. పోటీ పరీక్షలకు వెళితే, ఎన్నో అవకతవకలు. ఇక ఉద్యోగం మీద ఆశ వదిలేసుకుని నా ఉపాధి నేనే వెతుక్కున్నాను. 'డిగ్రీ చదివి బర్రెలు కాస్తున్నా' అని చేసిన వీడియోలో ఎవర్నీ దూషించలేదు. ఏ పార్టీ పేరు చెప్పలేదు. అయినా నా మీద కేసు వేశారు. కోర్టు చుట్టూ తిరుగుతున్నాను. ఈ పరిస్థితికి కారణమెవరు? వాళ్లెవరో నాకు తెలియాల్సిన అవసరం లేదు. కానీ ఓ నిరుద్యోగికి అన్యాయం చేస్తే ఆ ఫలితం ఎలా ఉంటుందో వాళ్లకి చెప్పాలనుకున్నాను. ఎంతో ఆలోచించాను. అప్పుడే ఎలక్షన్లలో పోటీచేయాలని నిర్ణయించుకున్నాను. నాలాంటి ఎందరో నిరుద్యోగులకు ప్రతినిధిగా నిలబడాలనుకున్నాను. అయితే నామినేషన్ వేసే రూ. 5000 ఫీజు కూడా నా దగ్గర లేదు. అమ్మ, స్నేహితులు సాయం చేశారు' అని చెప్పారు శిరీష.

దాడులు జరుగుతున్నాయి..

అక్టోబరు 8న శిరీష నామినేషన్ వేశారు. అప్పుడు ఆమె వెనుక ఎవరూ లేరు. ప్రచారం చేసేందుకు అనుమతి కోరితే 'ఏదైనా ప్రచార వాహనం ఉందా' అని అడిగారు. అప్పుడు ఆమె వెనుక మద్దతుగా నిలబడే మనుషులే లేరు. నామినేషన్ ఫీజు కట్టే పరిస్థితి లేదు. అయినా వెనుకడుగు వేయలేదు. ధైర్యంగా ముందుకురికింది. సోషల్‌మీడియా వేదికగా ఆమెను అనుసరిస్తున్న లక్షలాది మంది ఇప్పుడు రెట్టింపు అయ్యారు. దేశవిదేశాల నుండి మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ విశేష స్పందన ఆమెపై, సాయం నిలిచిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఇటీవలె ఆమె తమ్ముడిని అటకాయించి కొట్టారు. ఆ క్షణం శిరీష బావురుమని ఏడ్చుకుంటూ తమ్ముణ్ణి అక్కున చేర్చుకున్న దృశ్యం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది. తనకు రక్షణగా పోలీసులు వచ్చేవరకు ఆమె తమ్ముడిని అంటిపెట్టుకునే ఉంది. ఆ దాడి తరువాత శిరీష గోడకు కొట్టిన బంతి వలె మరింత శక్తిమంతంగా తయారైంది.

'నాకు మాట్లాడే స్వేచ్ఛ లేదా? నేను పోటీచేయకూడదని రాజ్యాంగంలో రాశారా? మా తాత నా చిన్నప్పుడు చెప్పాడు రౌడీ రాజకీయాల గురించి.. అప్పుడు నాకు అర్థం కాలే. ఇప్పుడు నా కళ్లతో చూస్తున్నా.. నా దగ్గర డబ్బులు లేవు. కానీ నాకు అధికారం ఇస్తే ఏయే గ్రామాల్లో ఏయే సమస్యలు ఉన్నాయో వాటి పరిష్కారానికి కృషిచేస్తాను. గ్రామంలో ఆస్పత్రి కడతాను. కోచింగ్ సెంటర్లు ఏర్పాటుచేస్తా. ప్రతి ఏడాది జాబ్ క్యాలండర్లు వచ్చేలా చేస్తా. 'డబ్బులు ఇస్తాం. నామినేషన్ వెనక్కి తీసుకో' అన్నారు. ఆ డబ్బులు నా జీవితాన్ని బాగు చేయొచ్చు. కానీ నా గెలుపు నాలాంటి వారందరికీ గొప్ప భరోసా ఇస్తుంది. అందుకే నేను ఆ ఒప్పందాలకు లొంగిపోలేదు. దీంతో బెదిరించారు. దాడులు చేశారు. ఈ ప్రయాణంలో మొదట నేను ఒక్కదాన్నే.. ఇప్పుడు నా వెనుక అనేక మంది ఉన్నారు. ఈ బలం నాలో ఎక్కడలేని ధైర్యాన్ని నింపుతోంది' అంటూ శిరీష చేస్తున్న ఉద్వేగ ప్రసంగాలను ప్రజలంతా ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. ప్రజాసంఘాలు, కవులు, రచయితలు, న్యాయవాదులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, సోషల్ మీడియా ఆమె ప్రయాణంలో తమ వంతు బాధ్యతను నిర్వహిస్తూ అండగా నిలబడుతున్నారు.

ఈ ఎన్నికల్లో శిరీష గెలవొచ్చు. గెలవకపోవచ్చు. కానీ, ఆమె తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గది. ఆమె తెగువ, పోరాటపటిమ నేటి యువతకి గొప్ప ఆదర్శం.

- జ్యోతిర్మయి

ఆగిన దాడులు

- అమల్లోకి కాల్పుల విరమణ
- బందీల మార్పిడి షురూ!

గాజా : ఇజ్రాయిల్ , హమాస్ మధ్య కుదిరిన నాలుగు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చింది. హమాస్, ఇజ్రాయిల్ మధ్య కుదిరిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం ఉదయం 7గంటల నుండి గాజాలో అమల్లోకి వచ్చింది. బందీల మార్పిడిలో భాగంగా తొలి రోజు హమాస్ 13మంది ఇజ్రాయిలీ బందీలను విడుదలచేసింది. దీనికి బదులుగా 39మంది పాలస్తీనియన్ రాజకీయ ఖైదీలను ఇజ్రాయిల్ విడిచిపెట్టింది. ఇరు పక్షాలు విడుదలైన బందీల జాబితాను పరస్పరం మార్చుకున్నాయని ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఆహారం, మందులు, నీరు సహా గాజాకు మానవతా సాయాన్ని తీసుకుని దాదాపు 200 ట్రక్కులు బయలుదేరాయి. హమాస్ చెర నుండి విడుదలైన వారిలో 12మంది థాయి జాతీయులు వున్నట్లు థాయిలాండ్ ప్రధాని తెలిపారు. కాగా ఇప్పటివరకు గాజాపై యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం జరిపిన అమానుష దాడుల్లో 14,800మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో మూడింట రెండొంతుల మంది మహిళలు, పిల్లలే. గాజాలో జరిగిన విధ్వంసం, నష్టాన్ని అంచనా వేయడానికి ఈ కాల్పుల విరమణ దోహదపడుతుందని ఐక్యరాజ్య సమితి మహిళా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిమా సామి బహౌస్ వ్యాఖ్యానించారు. ఇలాంటి సాయుధ ఘర్షణలు తలెత్తినపుడు అధికంగా మూల్యం చెల్లించేది మహిళలు చిన్నారులేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈజిప్ట్ నుండి గాజాకు ప్రతి రోజూ 1,30,000లీటర్ల డీజిల్, నాలుగు ట్రక్కుల గ్యాస్ వస్తుందని ఈజిప్ట్ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఎస్ఐఎస్) చైర్మన్ దియా రాష్వాన్ చెప్పారు.



బైడెన్‌కు నిరసన సెగ: గాజాలో చనిపోయినవారి మృతదేహాలను పోలిన తెల్లటి బాడీ బ్యాగ్స్‌ను వైట్ హౌస్ ఎదుట ప్రదర్శించినప్పటి చిత్రం. పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతపై అమెరికన్లు తమ నిరసనాగ్రహాన్ని ఈ రూపంలో తెలియజేశారు. ఈ అపూర్వ నిరసన ఈ నెల15వ తేదీన జరిగింది.

గోహత్య నిరోధక చట్టం బీఫ్ రవాణాను నిషేధించదు

అలహాబాద్ హైకోర్టు

లక్నో : యుపి గోహత్య నిరోధక చట్టం బీఫ్ రవాణాను నిషేధించదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. బీఫ్ రవాణాకు ఉపయోగించారనే ఆరోపణపై తన మోటార్‌సైకిల్‌ను జప్తు చేస్తూ ఫతేపూర్ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టును వసీం అహ్మద్ ఆశ్రయించారు. దీనిని విచారించిన జస్టిస్ పంకజ్ భాటియా "చట్టం పరంగా ఆంక్షలు, దాని కింద రూపొందించిన నియమాలు ఆవు, ఎద్దుల రవాణాకు సంబంధించి మాత్రమే వర్తిస్తాయి" అని తెలిపారు. మొత్తం చట్టంలో లేదా నిబంధనలలో, బీఫ్ రవాణా చేయడాన్ని నిరోధించే నిబంధన ఏదీ లేదని వివరించారు.

డీప్‌ఫేక్స్ నియంత్రణకు ప్రత్యేక అధికారి

న్యూఢిల్లీ : డీప్‌ఫేక్స్ నియంత్రణకు, వాటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని నియమించనుంది. ఈ విషయాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ శుక్రవారం వెల్లడించారు. అలాగే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిబంధనల ఉల్లంఘనలపై వినియోగదారులు తమ ఫిర్యాదులు నమోదు చేయడానికి ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని కూడా మంత్రి తెలిపారు. ఐటి నిబంధనలను ఉల్లంఘించే సోషల్ మీడియా సంస్థలపై ఈ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. మరోవైపు, ఐటి నిబంధనలకు అనుకూలంగా తమ ప్లాట్‌ఫారమ్‌లను సర్దుబాటు చేయడానికి సోషల్ మీడియా సంస్థలకు ఏడు రోజుల సమయం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు.

గిరిజన భూముల బదిలీపై వెనక్కి తగ్గిన ఒడిషా సర్కార్

భువనేశ్వర్ : గిరిజనేతరులకు గిరిజన భూమిని బదిలీ చేసేందుకు అనుమతించేలా ఒరిస్సా షెడ్యూల్డ్ ఏరియాల స్థిరాస్తుల బదిలీ నియంత్రణ, 1956 (ఒఎస్ఎటిఐపి) చట్టాన్ని సవరించాలన్న నిర్ణయాన్ని నవీన్ పట్నాయక్ ప్రభుత్వం శుక్రవారం ఉపసంహరించుకుంది. గిరిజన భూముల బదిలీని నిషేధించడమే కాకుండా షెడ్యూల్డ్ ఏరియాల్లో బలవంతంగా స్వాధీనానికి ప్రయత్నించడాన్ని నేరంగా కూడా ఈ చట్టం పరిగణిస్తోంది. ఒఎస్ఎటిఐపికి సవరణను రద్దు చేయాలన్న ప్రతిపాదనను మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్ర రెవిన్యూ మంత్రి అసెంబ్లీలో శుక్రవారం ఒక ప్రకటన చేశారు. కేవలం పది రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రభుత్వం తాను తీసుకున్న నిర్ణయాలను తానే ఉపసంహరించుకుంది. ఈ నెల 14న నిర్ణయం తీసుకున్నారు కానీ రెండు రోజుల్లోనే ఆ ప్రతిపాదనను నిలుపుచేశామంటూ మంత్రి సోషల్ మీడియాలో పెట్టారు.

9న డబ్ల్యుపిఎల్ వేలం

ఫ్రాంచైజీల నగదు పెంపు: బిసిసిఐ



ముంబయి: 2024 సీజన్‌కు సంబంధించి మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) వేలం తేదీని భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) శుక్రవారం వెల్లడించింది. డిసెంబర్ 09న ముంబయి వేదికగా డబ్ల్యుపిఎల్ వేలం జరగనుందని, ఈసారి ఫ్రాంచైజీల నగదు విలువను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. డబ్ల్యూపిఎల్ తొలి సీజన్ విజయవంతమైన నేపథ్యంలో రెండో సీజన్‌ను మరింత ఆసక్తిగా మార్చేందుకు గాను బిసిసిఐ రంగం సిద్ధం చేస్తోంది. ఈసారి డబ్ల్యుపిఎల్‌ను బెంగళూరు, ముంబయి వేదికలుగా నిర్వహించేందుకు బిసిసిఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతేగాక గతేడాది రూ.12 కోట్లుగా ఉన్న ఒక్కో ఫ్రాంచైజీ పర్స్ వాల్యూను ఈ ఏడాది రూ. 13.5 కోట్లకు పెంచింది. గతేడాదితో పోలిస్తే ఇది రూ.1.5 కోట్లు అధికం. డబ్ల్యూపిఎల్ ఫ్రాంచైజీలన్నీ ఇదివరకే తాము రిటైన్, రిలీజ్ చేసుకున్న ఆటగాళ్ల జాబితాను ప్రకటించిన విషయం విదితమే. ఐదు ఫ్రాంచైజీలు గత సీజన్‌లో తమతో ఆడిన 60 మంది క్రికెటర్లను రిటైన్ చేసుకుని 29మంది విడుదల చేశాయి. రిటైన్ చేసుకున్న వారిలో 21 మంది విదేశీ క్రికెటర్లున్నారు. రిటైన్, రిలీజ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రస్తుతం ఐదు ఫ్రాంచైజీల వద్ద పై నగదు మిగిలి ఉంది.

ఫ్రాంచైజీల వద్ద ఉన్న నగదు.. కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్ల వివరాలు

ఫ్రాంచైజీ	అందుబాటులో ఉన్న నగదు	ఆటగాళ్ల కొనుగోలు
ఢిల్లీ క్యాపిటల్స్	రూ. 2.25 కోట్లు	3
గుజరాత్ జెయింట్స్	రూ. 5.95 కోట్లు	10
ముంబై ఇండియన్స్	రూ. 2.1 కోట్లు	5
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు	రూ. 3.35 కోట్లు	7
యూపీ వారియర్స్	రూ. 4.00 కోట్లు	5

ఐదు ఫ్రాంచైజీలు 30మంది ఆటగాళ్లకు (9మంది విదేశీ క్రికెటర్లు) రూ.17.65 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

సెమీస్‌కు చిరాగ్-సాత్విక్

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



హాంగ్జౌ: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్‌శెట్టి జోడి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో చిరాగ్-సాత్విక్ జోడీ 21-16, 21-14తో ఇండోనేషియాకు చెందిన లియో-కర్నాండోలపై సునాయా సంగా నెగ్గారు. ఈ మ్యాచ్‌ను భారత జంట కేవలం 46నిమిషాల్లోనే ముగించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌కు చేరిన ఏకైక షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ జపాన్‌కు చెందిన కొడాయ్ నరోకా చేతిలో వరుస సెట్లలో ఓడాడు. క్వార్టర్స్‌లో ప్రణయ్ 9-21, 14-21తో పరాజయాన్ని చవిచూశాడు. శనివారం జరిగే సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఇండోనేషియాకే చెందిన హి-జె-టి, రెన్ ఎక్యూతో తలపడనున్నారు.

భారత్‌లో మూతపడ్డ ఆఫ్ఘన్ ఎంబసీ

న్యూఢిల్లీ : భారత్‌లో తమ ఎంబసీని శాశ్వతంగా మూసివేసినట్లు ఆఫ్ఘనిస్తాన్ ప్రకటించింది. అంతర్గత ఘర్షణల కారణంగా ఈ చర్య తీసుకున్నారని కొంతమంది వ్యాఖ్యానించవచ్చని, కానీ విధానపరమైన నిర్ణయాలు, ప్రయోజనాల్లో విస్తృత మార్పుల ఫలితమే ఈ నిర్ణయమని ఎంబసీ తెలిపింది. న్యూఢిల్లీలోని దౌత్యకార్యాలయం మూతపై ఒక అధికార ప్రకటన చేస్తూ, భారత ప్రభుత్వం నుండి పదే పదే ఎదురైన సవాళ్ళ వల్ల నవంబరు 23నుండి ఇది అమల్లోకి వచ్చిందని తెలిపింది. సెప్టెంబరు 30నుండే ఎంబసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఎంబసీ మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరిగి ఆఫ్ఘన్ ఎంబసీ సాధారణంగా పని చేసేందుకు అనుమతించేలా భారత ప్రభుత్వ వైఖరి మారగలదని ఆశిస్తున్నట్లు ఆ ప్రకటన తెలిపింది. వనరులు, అధికారాలు పరిమితంగానే వున్నప్పటికీ, పైగా కాబూల్‌లో చట్టబద్ధమైన ప్రభుత్వమేదీ లేనప్పటికీ తాము మెరుగైన రీతిలో అవిశ్రాంతంగా పనిచేశామని ఆఫ్ఘన్ ఎంబసీ ప్రకటించింది. గత రెండేళ్ళ మూడు మాసాలుగా ఆఫ్ఘన్ శరణార్ధులు, విద్యార్థులు, వ్యాపారాలు దేశాన్ని విడిచివెళుతుండడంతో భారత్‌లో ఆఫ్ఘన్ కమ్యూనిటీ బాగా తగ్గిపోయిందని ఎంబసీ తెలిపింది. 2021 ఆగస్టు నుండి ఈ సంఖ్య సగానికి సగం తగ్గింది.

గుజరాత్‌లో దళితుడికి అవమానం


- పాదరక్షను నోటిలో పెట్టుకొని క్షమాపణలు చెప్పాలని బలవంతం
- వ్యాపారస్తురాలిపై కేసు నమోదు

గాంధీనగర్ : గుజరాత్‌లో దళితుడికి అవమానకర ఘటన ఎదురైంది. ఆయనపై ఒక వ్యాపారస్తురాలు, ఆమె ఉద్యోగులు అమానవీయంగా ప్రవర్తించారు. బాధితుడిపై దాడికి దిగి ఆయన నోటిలో ఆమె పాదరక్షను పెట్టి, క్షమాపణలు చెప్పించేందుకు బలవంతం చేశారు. దీంతో పోలీసులు సదరు వ్యాపారస్తురాలిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మోర్బీ పట్టణంలో చోటు చేసుకున్నది. నిందితురాలిని విభుతి పటేల్ అలియాస్ రనీబాగా గుర్తించారు. ఆమె రనీబా ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్‌ను నడుపుతున్నది.

పోలీసులు, బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలేశ్ దల్సానియా (21).. విభుతి పటేల్‌కు చెందిన ఎక్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో అక్టోబర్ నెలలో 16 రోజులు పని చేశాడు. అక్టోబర్ 2న కంపెనీలో చేరిన దల్సానియాకు నెలకు రూ.12 వేల జీతం కుదిరింది. అయితే, 18న మాత్రం ఆయనను ఇక పనికి రావద్దని కంపెనీ తెలిపింది. అకస్మాత్తుగా ఇలా చెప్పటంతో దల్సానియా షాక్‌కు గురయ్యాడు. ఆ తర్వాత తన పెద్దన్న మెహుల్, వారి పొరుగున ఉండే వ్యక్తి భవేశ్ మక్వానాతో కలిసి రవాపార్ రోడ్ మీద ఉండే రనీబా ఇండస్ట్రీస్ కార్యాలయానికి వెళ్లారు. తాను పని చేసిన రోజులకు రావాల్సిన జీతాన్ని దల్సానియా డిమాండ్ చేశాడు. అయితే, విభుతి పటేల్ సోదరుడు ఓమ్ పటేల్.. దల్సానియాపై దాడికి దిగాడు. విభుతి పటేల్‌తో పాటు మరో ఐదుగురు ఉద్యోగులు కూడా బాధితుడిని కొట్టారు. ఆఫీసు బిల్డింగ్ మీదకు తీసుకెళ్లి బెల్టుతో దల్సానియాను కొట్టారు. ఇష్టం వచ్చినట్టు తన్నారు. పిడిగుద్దులు గుద్దారు.

విభుతి పటేల్ పాదరక్షను నోటిలో పెట్టునొని క్షమాపణ చెప్పాలని వారు దల్సానియాను బలవంతం చేశారు. రవాపూర్ రోడ్డు మీద కనబడినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా దల్సానియాను చంపేస్తానని నిందితురాలు హెచ్చరించింది. అయితే, ఈ ఘటనపై ఫిర్యాదు అందటంతో పోలీసులు నిందితురాలిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, ఈ ఘటనను దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

ఇంటివాడైన నవదీప్ సైనీ



టీమిండియా పేసర్ నవదీప్ సైనీ ఇంటివాడయ్యాడు. స్నేహితురాలు స్వాతి ఆస్థానా (ఫ్యాషన్, ట్రావెలర్ అండ్ లైఫ్ స్టయిల్ బ్లాగర్)ను ఉదయ్‌పూర్‌లోని దేబారి ఆనందం రిస్టార్స్‌లో పంజాబీ ఆచారాల ప్రకారం.. ఇద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68